



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక :231 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి ఆదివారం 30 ఆగస్టు 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :231 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI SUN 30 AUGUST 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వినియోగించుకోవడం లేదు




- శ్రీశైలం ప్రాజెక్టులో 71 శాతం వరకు నీటి నిల్వలు ఉన్నాయన్న కాకాణి
- సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్న
- నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన

- మిగతా 2లో

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు



- అల్లూరి జిల్లాలో ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమం అమలుకు నిర్ణయం
- మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం సెల్ టవర్ల ఏర్పాటు
- ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం

- మిగతా 2లో



## అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

- పీవీ సింధు, గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి వారి అకాడమీలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించామన్న రవీంద్ర
- రాష్ట్రంలో 6 ప్రత్యేక అకాడమీలు ప్రారంభించామని వెల్లడి
- ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'స్పోర్ట్స్ సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పీవీ సింధు, పుల్లెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖ క్రీడాకారుల అకాడమీలకు ప్రభుత్వం స్థలాలు

- మిగతా 2లో



## గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు

### ఏపీ గ్రీన్ కమిటీ చైర్మన్ నాగబాబు

- తమది నాటే సంస్కృతే కానీ, నరికేది కాదని స్పష్టం
- మంగళగిరి అరణ్యారామంలో రావి-వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు
- హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యమని పిలుపు
- రూ.24 కోట్లతో నిర్మించనున్న అరణ్యారామం భవన డిజైన్ల పరిశీలన

పెన్ పవర్ డెస్క్:ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభు త్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టం చేశారు. హరితాం ధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు.

- మిగతా 2లో

# ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

## సీఎం చంద్రబాబు ప్రకటన






- ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్లతో వైద్య సేవలు
- మందులు, రక్త నమూనాల రవాణాకు డ్రోన్ల వినియోగం
- పీహెచ్‌సీలను జిల్లా ఆసుపత్రులతో అనుసంధానించేలా ప్రణాళిక
- టెక్నాలజీతో ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- మారుమూల ప్రాంతాల్లోని ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందిస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు వైద్య సేవలను వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగించుకోనుంది. డ్రోన్ల ద్వారా మందులు, వైద్య పరికరాలను సరఫరా చేసే బృహత్తర ప్రాజెక్టును త్వరలో విస్తృతం చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సాంకేతికత ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చినప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తలపెట్టిన డ్రోన్ ప్రాజెక్టును సమీక్షించినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్పందిస్తూ, రహదారి సౌకర్యాలు పరిమితంగా ఉండే గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో డ్రోన్లు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని అన్నారు. డ్రోన్ల ద్వారా రక్త నమూనాలను సేకరించడం, అత్యవసర ఔషధాలను వేగంగా చేరవేయడం వంటివి ఈ ప్రాజెక్టులో కీలకమని వివరించారు.ఈ వ్యవస్థ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ) జిల్లా ఆసుపత్రులతో,

- మిగతా 2లో

## ఏఐ సాయంతో బ్రెయిన్ సర్జరీ




పెన్ పవర్ డెస్క్: వైద్య రంగంలో ఏఐ తీసుకొస్తున్న మార్పులు ఇప్పటికే స్పష్టంగా కనిపి స్తున్నాయి. వ్యాధులను గుర్తించడం, రోగి బాగోగులు చూడటం, డ్రగ్స్ మోతాదునీ దాని పనితీరునీ పరిశీలించడం,

- మిగతా 2లో



## సజ్జల చేతిలో జగన్ బందీ..

### నాపై దాడి జరిగినా పట్టించుకోలేదు

- వైసీపీలో తనకు ఎదురైన అవమానాలపై విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ
- సజ్జల రామకృష్ణారెడ్డి ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్ అని సంచలన ఆరోపణలు
- పార్టీ ప్లీనరీలో తనపై సజ్జల భౌతికంగా దాడి చేసినా జగన్ మౌనంగా ఉన్నారన్న విజయసాయి
- వైసీపీలో ఇప్పుడు జగన్ నంబర్ 2, సజ్జల నంబర్ 1 అని తీవ్ర విమర్శలు
- ఆత్మగౌరవం చంపుకోలేకనే రాజ్యసభ పదవికి, పార్టీకి రాజీనామా చేశానని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:రాజ్యసభ మాజీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయి రెడ్డి రాజకీయంగా పెను దుమారం రేపారు. వైసీపీలో ఉన్నప్పుడు తనకు ఎదురైన పరిస్థితులు, అవమానాలను వివరిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై నిప్పులు చెరుగుతూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను

- మిగతా 2లో

### ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

## నాణ్యతా లోపాలే కారణం

- ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీల ఇంగువ అమ్మకాలపై నిషేధం
- నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తేల్చిన ఎఫ్ఎస్ఎస్ఏఐ
- నమూనాల్లో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ పరిమాణం చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తింపు
- కంపెనీల ముడిసరుకులోనూ నాణ్యత లోపాలు ఉన్నాయని వెల్లడి
- దిద్దుబాటు చర్యలు చేపట్టాలని రెండు సంస్థలకు స్పష్టమైన ఆదేశం

- మిగతా 2లో




## ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ..

### అధికారులపై ఎమ్మెల్యే దానం ఆగ్రహం

- దానం రాకముందే లక్కీ డ్రా ప్రారంభించిన అధికారులు
- ప్రోటోకాల్ ప్రారంభించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారన్న దానం
- బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

- మిగతా 2లో





## వేపచెట్టు రేపిన చిచ్చు.. ఇద్దరి దారుణ హత్య

- సూర్యాపేట జిల్లా ఎర్రగడ్డ తండాలో విషాదం
- గొడ్డళ్లతో దాడులు చేసుకున్న రెండు వర్గాలు
- అడ్డుకునేందుకు యత్నించిన ఎస్సై నవీన్ కుమార్ కి గాయాలు

- మిగతా 2లో

## ఎంఐఎం నుంచి బహిష్కరణ..

### అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ

- ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన మజ్లిస్
- సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నవి డీప్‌ఫేక్ వీడియోలని ఆరోపణ
- తనను, పార్టీని అప్రతిష్టపాలు చేసే కుట్ర అని రహ్మత్ బేగ్ వ్యాఖ్య
- వీడియోలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ముందే ఫిర్యాదు చేశానని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను ఎంఐఎం పార్టీ నుంచి బహిష్కరించడం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర



- మిగతా 2లో

## హర్మూజ్ సంక్షోభం

### గల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది

- ఆరు నెలలుగా కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంక్షోభం
- అంతర్జాతీయ షిప్పింగ్‌పై 70 దాడులు, 19 మంది నావికుల మృతి
- ఇంధనం, ఎరువుల సరఫరా గొలుసులపై తీవ్ర ప్రభావం
- పరిష్కారానికి కృషి చేయాలని సభ్య దేశాలకు ఐఎంఓ పిలుపు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు

- మొదటి పేజి తరువాయి

శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి-వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.అనంతరం, రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమశైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

- మొదటి పేజి తరువాయి

కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు.

రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని వైజాగ్, అమరావతి, తిరుపతిగా 3 జోన్లుగా విభజించినట్లు తెలిపారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సీఎస్ఆర్ నిధులతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు.

# ఏఐ సాయంతో బ్రెయిన్ సర్జరీ

- మొదటి పేజి తరువాయి

స్కానింగ్ రిపోర్టులను విశ్లేషించడం ఇలా వైద్యరంగంలో ఏఐ వేగంగా విస్తరిస్తోంది. ఇలాంటి వాటి సాయంతో మెదడుకు జరిగిన ఓ శస్త్రచికిత్స విజయవంతమైంది. యూకే కు చెందిన ఆ పేషెంట్ కోలుకొని, ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారు.

యూకేకు చెందిన 48 ఏళ్ల రిస్ హిబ్బర్ట్.. ఒకరోజు నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు హఠాత్తుగా స్పృహకోల్పోయారు. తర్వాత మూర్ఛకు లోనయ్యాడు. అప్పటివరకు అతడికి ఎలాంటి అనారోగ్యమూ లేదు. వైద్యులు మెదడుకు స్కానింగ్ తీయగా.. పిట్యుటరీ గ్రంథి సమీపంలో 11 మి.మీ. పరిమాణంలో కణితి ఉందని గుర్తించారు. అది క్యాన్సర్ కాదని తేలినా.. చూపుపై ప్రభావం పడింది. దానిని తొలగించకపోతే.. కంటిచూపు పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని అర్థమైంది.అతను చిన్నదానికే అలసటకు గురయ్యేవాడు.

వైద్యులు అతనికి ఏఐ టెక్నాలజీ సాయంతో శస్త్రచికిత్స నిర్వహించారు. మేలోనే అది జరిగినా.. పేషెంట్ పూర్తిగా కోలుకునేవరకు దాని గురించి బయటపెట్టలేదు. ఎండోస్కోపీ అందించిన లైవ్ సర్జరీ వీడియోను ఏఐ విశ్లేషించడంతో సంక్లిష్ట ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించేలా వైద్యులకు వీలుకలిగింది. ఈ వివరాలను వైద్యులు మీడియాకు వెల్లడించడంతో తాజాగా విషయం వెలుగులోకి వచ్చింది.

# ఎంఐఎం నుంచి బహిష్కరణ..

## అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ

- మొదటి పేజి తరువాయి

వీడియోలు వైరల్ కావడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే, ఆ వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలని, తనను అప్రతిష్ఠపాలు చేసేందుకే ఈ కుట్రకు పాల్పడ్డారని రహ్మత్ బేగ్ ఆరోపించారు.

పార్టీ బహిష్కరణకు ముందే తన కుటుంబంతో కలిసి మక్కా వెళ్లిన రహ్మత్ బేగ్, అక్కడి నుంచే ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. హైదరాబాద్‌లోని తన స్నేహితులు ఫోన్ చేసి సోషల్ మీడియాలో కొన్ని అశ్లీల వీడియోలు వైరల్ అవుతున్నట్లు సమాచారం అందించారని ఆయన పేర్కొన్నారు. ఆ వీడియోలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగానే తనపై కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీని, పార్టీ అధినేతలు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల ప్రతిష్ఠను దిగజార్చేందుకే ఈ డీప్ ఫేక్ వీడియోలను సృష్టించారని ఆయన వివరించారు.

ఈ అంశంపై తాను ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగంతో పాటు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశానని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని రహ్మత్ బేగ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 28వ తేదీ రాత్రి ఎంఐఎం అధిష్ఠానం ఆయనను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. శాసనమండలి సభ్యత్వానికి కూడా వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను పార్టీ అధికారికంగా ప్రకటించలేదు. తాజా పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని ఇతర రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్ఠమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన దుస్థితి ఉండకూడదన్నదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'సంజీవని' కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.ఆరోగ్య సేవలతో పాటు కనెక్టివిటీకి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్లను

ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలోనే అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకే భోగాపురంలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. గిరిజన బిడ్డలు థింసా నృత్యంతో గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు

## ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

# నాణ్యతా లోపాలే కారణం

ప్రముఖ మసాలా దినుసుల బ్రాండ్లు ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్, లాల్జీ గోధూ కంపెనీలకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఖీూూూ×) గట్టి షాక్ ఇచ్చింది. ఈ రెండు సంస్థలు విక్రయిస్తున్న కాంపౌండెడ్ ఇంగువ (హింగ్ పౌడర్) నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేలడంతో, వాటి అమ్మకాలపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా వెల్లడించింది.

మార్కెట్‌లో నిరంతర నిఘా, చట్టపరమైన నమూనాల సేకరణ అనంతరం జరిపిన పరీక్షల్లో ఈ రెండు కంపెనీల ఇంగువ ఉత్పత్తులు నాణ్యత తక్కువగా (సబ్-స్టాండర్డ్) ఉన్నాయని, కొన్ని సందర్భాల్లో తప్పుడు బ్రాండింగ్ (మిస్‌బ్రాండెడ్) లేదా కల్తీకి గురైనట్లు గుర్తించామని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది.

**ఎవరెస్ట్ ఉత్పత్తుల్లో తీవ్ర లోపాలు**

ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్ విక్రయిస్తున్న ఇంగువ పొడి, దాని వేరియంట్లలో నాణ్యత లోపాలు స్పష్టంగా కనిపించాయి. ఒక నమూనాలో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ నిబంధనల ప్రకారం కనీసం 5 శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 0% ఉన్నట్లు ప్రయోగశాల పరీక్షల్లో తేలింది. అదేవిధంగా, ఎవరెస్ట్ యెల్లో హింగ్ పౌడర్‌లో 3.29%, బ్లాక్ హింగ్ పౌడర్‌లో 4.4 శాతం మాత్రమే ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ ఉన్నట్లు గుర్తించారు. గతంలో కూడా ఈ కంపెనీకి చెందిన చికెన్ మసాలా, గరం మసాలా, ఎగ్ కర్రీ పౌడర్ వంటి ఉత్పత్తుల లేబులింగ్‌లో లోపాలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తుచేసింది.

**లాల్జీ గోధూ ఇంగువలోనూ అదే పరిస్థితి**

లాల్జీ గోధూ కంపెనీకి చెందిన పొడి, గడ్డల రూపంలో ఉన్న ఇంగువ నమూనాలు కూడా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా, ఇంగువ తయారీకి ఉపయోగించే ముడిసరుకులోనూ అధికంగా స్టార్చ్ (పిండి పదార్థం) ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం ఇంగువలో స్టార్చ్ ఒక శాతానికి మించి ఉండకూడదు. మార్కెట్‌లో సేకరించిన పలు బ్యాచ్‌ల నమూనాల్లో ఈ ఉల్లంఘనలు విస్తృతంగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది.

ఈ నేపథ్యంలో, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీలు తమ ఇంగువ ఉత్పత్తుల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. తమ ఉత్పత్తుల్లోని లోపాలను సరిదిద్దడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఇకపై కేవలం నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే తయారుచేసి విక్రయించాలని స్పష్టం చేసింది. ఆదేశాలను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# సజ్జల చేతిలో జగన్ బందీ..

## నాపై దాడి జరిగినా పట్టించుకోలేదు

- మొదటి పేజి తరువాయి

విడుదల చేశారు. తనపై "నమ్మకద్రోహి" అంటూ వైసీపీలోని ఓ వర్గం దుష్ప్రచారం చేయిస్తున్నందునే ఈ లేఖ రాయాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ లేఖలో ఆయన చేసిన ఆరోపణలు, వెల్లడించిన విషయాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

**సజ్జల ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్**

"నేనే గనక నమ్మకద్రోహిని అయితే, ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని సీబీఐ, ఈడీ చార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌గారికి నమ్మకస్తుడిననే ఒకే ఒక్క కారణంతో ప్రతి చార్జిషీట్‌లో నన్ను ఏ-2గా చేర్చారు. జగన్‌గారు 16 నెలలు జైల్లో ఉంటే, నేను 15 నెలలు జైల్లో ఉన్నాను. నమ్మకద్రోహం నా రక్తంలో ఉంటే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని" అని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. 2024 ఎన్నికల తర్వాత కూడా తనకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో ఏ-5గా, కాకినాడ సీపోర్టు కేసులో ఏ-2గా తనను చేర్చారని, కానీ ఈ రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో "సకల శాఖల మంత్రి" అయిన సజ్జల పేరు ఒక్క చార్జిషీట్‌లో కూడా లేకపోవడం గమనార్హమన్నారు. జగన్‌కు వెన్నుపోటు పొడుస్తూ, టీడీపీతో కలిసి ఎలా పనిచేయాలో, కేసులు లేకుండా ఎలా చూసుకోవాలో ఆ "కోటరీ నాయకుడికి" తెలిసినంత తనకు తెలియదని ఎద్దేవా చేశారు.

**ప్లీనరీలో భౌతిక దాడి.. జగన్ ప్రేక్షకపాత్ర**

2022లో మంగళగిరిలో జరిగిన పార్టీ ప్లీనరీలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నేరుగా భౌతికంగా దాడి చేశారని, ఈ విషయం జగన్‌కు తెలిసినా ప్రేక్షకపాత్ర వహించారని విజయసాయి రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. పార్టీలో ఉన్న ఇతర నాయకులు కూడా ఈ ఘటనను చూశారని తెలిపారు. అప్పటికే సజ్జల చేతిలో జగన్ బందీ అయిపోయారని, అందుకే తనను పూర్తిగా పక్కనపెట్టేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో "సాయన్నకు వయసైపోయింది, ముసలోడైపోయాడు" అంటూ అనుబంధ సంఘాల బాధ్యతల నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఉత్తరాంధ్ర, గుంటూరు నుంచి తిరుపతి వరకు ఉన్న జిల్లాల ఇంఛార్జ్ బాధ్యతల నుంచి, చివరకు కోర్ కమిటీ నుంచి కూడా తొలగించారని వివరించారు. ఇలాంటివి మొత్తం 74 అవమానాలు జరిగాయని, ఎన్నో విషయాలు కడుపులోనే దాచుకున్నానని అన్నారు.

**సకల శాఖల మంత్రిగా సజ్జల.. జగన్‌కు గోడ కట్టారు**

"2019లో పార్టీ ఘనవిజయం సాధించిన తర్వాత సజ్జల ప్రమేయం శృతిమించింది. పరిపాలన జగన్‌గారు చేశారా లేక సజ్జల 'సకల శాఖల మంత్రి'గా, రాజ్యాంగేతర శక్తిగా తన ముఠాతో చేశారా? ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సైతం అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా జగన్‌ను కలవనీయకుండా గోడ కట్టింది సజ్జల కాదా?" అని విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. పెద్దిరెడ్డి, బొత్స, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరినీ రీజినల్ కోఆర్డినేటర్లుగా పెట్టి, అందరూ చీఫ్ కోఆర్డినేటర్ సజ్జలకు రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు తనకు ఆమోదయోగ్యం కాలేదన్నారు. అందుకే తన ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేయలేక, నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలాన్ని ముందే వదులుకుని పార్టీకి కూడా రాజీనామా చేశానని స్పష్టం చేశారు.

**వైసీపీలో నంబర్ 2 జగన్.. నాది కోవర్ట్ రాజకీయం కాదు**

"ఇప్పుడు వైసీపీలో నంబర్ 2 ఎవరంటే జగన్‌గారు. నంబర్ 1 ఎవరంటే 'సకల శాఖల మంత్రి' సజ్జల" అని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ కొత్త నంబర్ వన్‌కు నమస్కారాలు, సాష్టాంగాలు పెడుతూ తాను సర్దుకుపోలేనని, అందుకే పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. తాను జగన్‌కు ఎన్నడూ ద్రోహం చేయలేదని, చేయబోనని స్పష్టం చేశారు.

పార్టీని కబ్జా చేసి, జగన్‌ను మోసం చేస్తూ కోవర్ట్ రాజకీయం చేయడం తనకు చేతకాదని, తాను ప్రజాస్వామ్యబద్ధంగా నేరుగా గెలిచేందుకే యుద్ధం చేస్తానని, అందుకే కొత్త పార్టీ పెడుతున్నానని ప్రకటించారు. పార్టీలో ఎవరు కోవర్టుగా పనిచేస్తున్నారో కార్యకర్తలు, అభిమానులు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. మరో సందర్భంలో మీడియా ద్వారా మరిన్ని నిజాలు తెలియజేస్తానని తన లేఖను ముగించారు.

# శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వినియోగించుకోవడం లేదు

శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ దానిని ఉపయోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 71 శాతం వరకు నీటి నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ... సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన నిలదీశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వెంటనే నీటిని ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలని... రాయలసీమ, నెల్లూరు జిల్లా రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ఉద్దేశమా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించినా ప్రభుత్వం మౌనంగా ఉండటం వెనుక ఉన్న దురుద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి నీటిని ఎడాపెడా తరలించుకుపోతుంటే, ఏపీ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని కాకాణి మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల కోసం చంద్రబాబు ఏపీ రైతుల జీవితాలను తాకట్టు పెడుతున్నారా అని ప్రశ్నించారు. సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్లే మొదటి పంటకే సాగునీరు అందక నెల్లూరు జిల్లా రైతాంగం ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.

## ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

- మొదటి పేజి తరువాయి

ఇతర వైద్య విభాగాలతో అనుసంధానించడం సులభతరం అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఉన్న ఈ విధానాన్ని మరింత వ్యవస్థీకృతం చేసి, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతంలో నివసించే ప్రతి పౌరుడికీ నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.టెక్నాలజీ సహాయంతో ఆరోగ్య సేవలను మరింత వేగవంతం చేసి, ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థలను బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ ద్వారా ఈ వివరాలను పంచుకున్నారు.

# వేపచెట్టు రేపిన చిచ్చు.. ఇద్దరి దారుణ హత్య

సూర్యాపేట జిల్లాలో ఓ చిన్న వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య రేగిన చిచ్చు... దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఈ దాడిలో గొడ్డలి వేట్లకు గురైన ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఈ ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతో పాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో... ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ..

ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ/గృహలక్ష్మి ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ధ్వజమెత్తారు. తాను రాకముందే అధికారులు లక్కీ డ్రా ప్రారంభించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వయంగా డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఆయన రాకముందే అధికారులు ప్రక్రియను ప్రారంభించడంతో తీవ్ర అసంతృప్తికి గురైన దానం నాగేందర్ అధికారులపై మండిపడ్డారు.

ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా, ప్రోటోకాల్ పాటించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని దానం నిలదీశారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నిరసనగా కార్యక్రమం మధ్యలోనే అలిగి వెనుదిరిగారు. కాగా, హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం నాలుగు రోజుల పాటు ఈ లక్కీ డ్రా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

## హర్మ్యాజ్ సంక్షోభంగల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. హర్మ్యాజ్ జలసంధిలో ఏర్పడిన సంక్షోభం కారణంగా గత ఆరు నెలలుగా సుమారు 400 నౌకలు, వాటిలోని దాదాపు 6,000 మంది సిబ్బంది చిక్కుకుపోయారని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) శుక్రవారం వెల్లడించింది.

ఈ సంక్షోభం ఇంకా సమసిపోలేదని ఐఎంఓ సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగ్యూజ్ తెలిపారు. కొన్ని నౌకలు, సిబ్బంది ఆ ప్రాంతం నుంచి బయటపడగలిగినప్పటికీ, వేలాది మంది నావికులు ఇప్పటికీ తీవ్ర ముప్పును, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఈ అంతరాయం కారణంగా ఇంధనం, ఎరువులు వంటి నిత్యావసర వస్తువుల ప్రపంచ సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఫిబ్రవరి 28న ఈ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ నౌకాయానంపై కనీసం 70 దాడులు జరిగినట్లు ఐఎంఓ ధృవీకరించింది. ఈ దాడుల్లో 19 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ జలసంధుల గుండా రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని జూలైలో ఐఎంఓ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ జలమార్గంలో నౌకాయానాన్ని పునరుద్ధరించడానికి సభ్య దేశాలన్నీ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చింది.

ఈ సమస్యకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనేందుకు సభ్య దేశాలు, షిప్పింగ్ పరిశ్రమ కలిసి పనిచేయాలని డొమింగ్యూజ్ కోరారు. మరోవైపు, నల్ల సముద్రం, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ వంటి ప్రాంతాల్లో కూడా సముద్ర భద్రత క్షీణిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడులతో మొదలైన ఈ వివాదంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, నౌకాయానం, ఇరాన్ అణు కార్యక్రమం, అంతర్జాతీయ ఆంక్షల వంటి అంశాలపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది.

# రైల్వే పనులకు స్పీడ్ పెంచాలి

- భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 29**

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 29: గుంతకల్లుగుంటూరు రైల్వే మార్గంలో చేపడుతున్న డబ్లింగ్, విద్యుదీకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గుంతకల్లు కన్స్ట్రక్షన్స్ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సంతోష్ కుమార్, ఎస్ఎస్ఈ ఆనంద్ కుమార్, ధోన్ కన్స్ట్రక్షన్స్ ఏఎక్స్ఈ భగవాన్ దాస్ తదితర రైల్వే అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ప్రాజెక్టుకు సంబంధించి సుమారు 2 ఎకరాల 32 సెంట్ల భూమి భూసేకరణ ప్రక్రియలో ఉందని అధికారులు వివరించారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించి పనులకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. డబ్లింగ్, విద్యుదీకరణ పనులు పూర్తయితే రైళ్ల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రయాణికులు, సరుకు రవాణాకు మరింత ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# కూటమి పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిన్నది

## : మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 29**

సెప్టెంబర్ 1వ తేది... సాగునీటి సాధన కోసం ...వెలుగోడు రిజర్వాయర్ వద్ద భారీ ధర్నా విజయవంతం చేయండి... మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

రాయలసీమ రైతాంగ సమస్యలపై రైతన్నలతో సమావేశం

కూటమి ప్రభుత్వంపై నిరసనలకు పిలుపు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రాయలసీమ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో రైతులతో కలిసి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి హెచ్చరించారు. సెప్టెంబర్ 1వ తేది... సాగునీటి సాధన కోసం ...వెలుగోడు రిజర్వాయర్ వద్ద రైతులతో వైసీపీ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపడుతున్నట్లు , ఈ నిరసన కార్యక్రమంలో రైతులు, రైతు సంఘం నేతలు, వైసీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సి. ఈ.సి నెంబర్ పీపీ నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రైతు సంఘం నాయకులు అరికట్ల శివరామకృష్ణారెడ్డి, శివారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు







నంద్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వారి నుండి అభిప్రాయాలను, సూచనలను స్వీకరించి భవిష్యత్తు కార్యాచరణ పై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయానికి సంబంధించి రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పాలనలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, గిట్టుబాటు ధరలు లేక, సకాలంలో ఆదుకునే నాథుడు లేక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. పండించిన పంటకు సరైన ధరలు కల్పించడంలోనూ, సాగునీరు అందించడంలోనూ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతుల హక్కులను కాపాడుకోవడానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అన్నదాతలకు అండగా నిలబడేందుకు రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని, క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టి అధికారులను, ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. రైతుల పక్షాన వైస్సార్సీపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నంద్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు రైతు నాయకులు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 104చంద్రన్న సంచార వాహన

# శిబిరంలో ఆశలే డాక్టర్ లా...?



దొరవారి సత్రం : పెన్ పవర్, ఆగస్టు 29

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య సేవలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజల ముంగిటకే వైద్య సేవలు చేరువ చేయాలని అనేక పథకాలను అమలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగాప్రతి సచివాలయ పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్ ల ద్వారా సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా " ప్రత్యేకించి చంద్రన్న సంచార 104 వాహనం ద్వారా హ్యాబిటేషన్ల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు నిమిత్తం పలు ఆరోగ్య సేవలో అందించాలని ప్రభుత్వం104 వాహనం ఏర్పాటు చేసింది. అయితే దొరవారి సత్రం మండల పరిధిలోని తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 104 సంచార వైద్య సేవలు నామమాత్రంగానే అందుతున్నాయని ఆయా గ్రామాల నుండి ఫిర్యాదులతో కూడిన ఆరోపణలు కూడా ఉన్నాయి. 104 వాహన వైద్య శిబిరంలో విధిగా డాక్టర్, ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం, డిఇఓ లతోపాటుఆ పరిధిలోని ఆశా కార్యకర్తలు సహాయకులుగా హాజరు కావాలి. కానీ శనివారం తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న తల్లంపాడు ఉపకేంద్రం, మావిళ్ళపాడులో జరిగిన చంద్రన్న సంచార వైద్య శిబిరంలో ఆశా కార్యకర్తలే డాక్టర్లుగా వ్యవహరించారు. రోగులను పరీక్షించేందుకు డాక్టర్, ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం ఎవరూ హాజరు కాకపోవడంతో వచ్చిన రోగులను తిరిగి పంపలేక బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందించి పంపించారు. ప్రధానంగా వైద్యాధికారి పర్యవేక్షణలో పరీక్షలు చేసి,రోగస్థాయి వ్యత్యాసాలను బట్టి మందులు మార్పు చేయడమా, మోతాదు తగ్గించడమా, వారి అనుమానాలు నివృత్తి చేసి,ఆహార - ఆరోగ్య సలహాలు ఇవ్వాలి. వచ్చిన ఓపి రోగుల వివరాలను కూడా ఆన్లైన్లో నమోదు చేయాలి. ఆ పరిధిలో ఉన్న గర్భవతులను కూడా పరీక్షించి, బాలింతలకు సలహాలు ఇవ్వాలి. పలు రకాల వైద్య పరీక్షలు చేపడితేనే ప్రభుత్వ ఆశయం నెరవేరే అవకాశం ఉంది. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 104 వైద్య సేవల శిబిరాల్లో వైద్యులు సమయపాలన పాటించక, పలు పర్యాయాలు హాజరుకాక గ్రామీణ రోగులకు వైద్యని పర్యవేక్షణలో ఆరోగ్య సేవలు అందడం లేదనే ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. సంబంధం లేని ఆశా కార్యకర్తలే డాక్టర్లుగా, నర్సులుగా చలామణి అవ్వడం పై గ్రామాల్లో కూడా చర్చించుకుంటున్నారు.సంబంధిత జిల్లా అధికారులు పర్యవేక్షణ చేపట్టి ప్రభుత్వ ఆశయంతో పాటు, ప్రజలకు సంచార వైద్యశాల104 ద్వారా అందుబాటులోనే మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# మైదానమే వేదిక.. విజయమే లక్ష్యం!

- క్రీడలతో ఆరోగ్యం.. క్రమశిక్షణ.. ఆత్మవిశ్వాసం
- మొబైల్ గేమ్స్ వద్దు.. మైదానాల్లో ఆటలు ముద్దు: డీఈఓ కె.వి.ఎన్. కుమార్



**శ్రీకాళహస్తి , పెన్ పవర్ , ఆగస్టు 29 :**

విద్యార్థులు మొబైల్ ఫోన్లలో గేమ్స్ ఆడటానికే పరిమితం కాకుండా మైదానాల్లో ఆటలు ఆడి ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలోని ఆర్ పి బి ఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్( ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవం2026, క్రీడా ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను పాఠశాల స్థాయిలోనే గుర్తించి, సరైన శిక్షణ, ప్రోత్సాహం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. "మొబైల్‌లో గేమ్స్ చూడటం కాదు.. మైదానంలో ఆట ఆడాలి. గెలుపు కోసం ఆడటంతో పాటు, జీవితంలో గెలవడానికి క్రీడలు నేర్పే పాఠాలను అలవర్చుకోవాలి" అని అన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి క్రీడాకారులకు మెడల్స్, షీల్డ్స్, ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా అభినందించారు. తిరుపతి జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత మంది క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు.







కార్యక్రమంలో ా+ఖీ సెక్రటరీ కిషోర్, ఎంఈఓ బాలయ్య, జిల్లా అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి భార్గవి, ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థి క్రీడాకారులు పాల్గొన్నారు.

# లారీని ఢీకొని స్కూటరిస్ట్ మృతి





**దొరవారి సత్రం : పెన్ పవర్, ఆగస్టు 29**

కలకత్తా- చెన్నై జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ మృతి చెందాడు

వివరాల మేరకు ప్రకాశం జిల్లా, మాధవరం గ్రామానికి చెందిన రాపూరు. ఏడుకొండలు (21) చెన్నై నుండి ాజూ40/ఖ2692 నెంబరు గల బైక్ పై చెన్నై నుండి బయలుదేరి స్వగ్రామానికి వెళుతున్న సమయంలో అదుపుతప్పి కుప్పారెడ్డిపాలెం గ్రామ సమీపంలోని ధాబా వద్ద లారీని ఢీకొనడం జరిగింది.

ఈ సంఘటనలో రాపూరు ఏడుకొండలు ఘటనా స్థలంలోని మృతి చెందాడు. ఈ సంఘటనపై దొరవారిసత్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# మన పూర్వీకుల వనమూలికా వైద్యం రోగాల నియంత్రణకు శ్రేయస్కరం"

## డాక్టర్ మంతెన సత్యనారాయణ"

**తిరుపతి, పెన్ పవర్, ఆగస్టు 29**

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం

చిన్ననాటి నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలి

రెండు రోజుల అవగాహన సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

నిద్ర, పోషకాహారం, వ్యాయామం, ప్రాణాయామం.. ఆరోగ్యానికి మూల కారణం

జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి, ఆగస్టు 29: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమని ప్రముఖ ప్రకృతి వైద్య ఆరోగ్యనిపుణులు మరియు ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు పేర్కొన్నారు

శనివారం స్థానిక మహతి ఆడిటోరియంలో హెల్త్ కేర్ మరియు డిజిటల్ వెల్నెస్ పై ప్రముఖ ప్రకృతి వైద్య ఆరోగ్యనిపుణులు మరియు ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండు రోజుల అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రకృతి వైద్య ఆరోగ్యనిపుణులు మరియు ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన జీవనశైలి, మానసిక దృఢత్వం, డిజిటల్ వెల్నెస్‌పై అవగాహన ఎంతో అవసరమని తెలిపారు. తిరుపతిలో నిర్వహిస్తున్న రెండు రోజుల అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండటమే కాకుండా, వారి భవిష్యత్తుకు చక్కటి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. డిజిటల్ వెల్నెస్, ఎమోషనల్ ఫిట్‌నెస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వచ్చిన బాలకృష్ణను సభకు పరిచయం చేస్తూ, ఐఐటీ విద్యార్థులకు శిక్షణ అందించిన అనుభవం ఉన్న ఆయన సూచనలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు యోగా మాస్టర్ గా వ్యవహరిస్తున్న డాక్టర్ బైరి శ్రీనివాసరావును కూడా సభకు పరిచయం చేసి, విద్యార్థులకు యోగా, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు వేదికపైకి ఆహ్వానించారు. .అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రకృతి వైద్య ఆరోగ్య నిపుణులు డా. మంతెన సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ప్రివెంటివ్ హెల్త్‌కేర్ మరియు డిజిటల్ వెల్‌నెస్ అంశాలపై నిర్వహిస్తున్న రెండు రోజుల అవగాహన సదస్సు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రస్తుత జీవనశైలి, కుటుంబం, సామాజిక పరిస్థితుల కారణంగా చిన్న వయసులోనే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఆధునిక జీవనశైలి ప్రభావంతో ఆరోగ్యకరమైన సాంప్రదాయ అలవాట్లకు దూరమవుతున్నందున ఊబకాయం, రక్తపోటు తదితర సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందస్తు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలని, శారీరక ఆరోగ్యంతో పాటు ఎమోషనల్ ఫిట్‌నెస్, ఐక్యూ, ఆరోగ్యకరమైన మానవ సంబంధాల ప్రాధాన్యతను విద్యార్థులు గుర్తించాలని సూచించారు. సదస్సులో నిపుణులు అందించే సూచనలను రోజువారీ జీవితంలో అలవాట్లుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. చిన్నతనం నుంచే జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన నిద్ర, తగినంత నీరు, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన శారీరక వ్యాయామం, పరిశుభ్రమైన జీవనశైలి, ప్రశాంతమైన ఆలోచనలు, ప్రాణాయామం వంటి మంచి అలవాట్లను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని పేర్కొన్నారు. మానసిక దృఢత్వం పెంపొందించుకోవడం ద్వారా క్లిష్ట పరిస్థితులను ప్రశాంతంగా ఎదుర్కొని విజయాన్ని సాధించవచ్చని కలెక్టర్ అన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లను చిన్న వయసు నుంచే అలవరుచుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో కూడిన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు సూచించిన సూత్రాలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పాటించి, ఆరోగ్యకరమైన మరియు విజయవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. రెండు రోజుల అవగాహన కార్యక్రమాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకుని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## వెంగమాంబ పేరంటాల అమ్మవారిని

# దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యే

**నర్రవాడలో 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో పాల్గొన్న నేతలు**



**దుత్తలూరు, పెన్ పవర్ ఆగస్టు 29 :**

ఉదయగిరి నియోజకవర్గ పర్యటనలో భాగంగా దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలోని శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారి ఆలయాన్ని నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం దర్శించుకున్నారు. వారితో పాటు మాజీ ఎమ్మెల్యే కంభం రామిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ చెంచల్‌బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులు, ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం నర్రవాడలో నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు సహా అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకే 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రులు, ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల కోసం ముందుకొచ్చిన డాక్టర్ కోటేశ్వరబాబు

## చిన్న సాయం.. విద్యార్థులకు ఎంతో భరోసా







శ్రీకాళహస్తి,పెన్ పవర్,ఆగస్టు 29:
లంకమిట్ట ప్రాంతంలోని గిరిజన విద్యార్థులకు ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు అండగా నిలిచారు. సొసైటీ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలోని ట్యూషన్ సెంటర్‌లో చదువుతున్న 43 మంది గిరిజన విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ఉపయోగపడే నాణ్యమైన ప్లేట్లు, గ్లాసులను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి సహాయం చేసిన డాక్టర్ కోటేశ్వరబాబు సేవా దృక్పథాన్ని నిర్వాహకులు, స్థానికులు అభినందించారు. విద్యార్థులకు ఈ సహాయం ఎంతో ఉపయోగకరమని తెలిపారు.
కార్యక్రమంలో ట్యూషన్ మాస్టర్ షేక్ అజారుద్దీన్, విశాలాంధ్ర రిపోర్టర్ పురుషోత్తం, మస్తాన్, శైల, పుష్ప, ధర్మమ్మ, గాయత్రి, ఢిల్లేశ్వరి, చెంచమ్మ, శ్రీలత, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

## హాకీ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆద్వర్యంలో.. ఘనంగా మేజర్ ద్యాన్ చంద్ మరియు జాతీయ క్రీడా దినోత్సవం



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 29**
నంద్యాల లో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకల్లో హాకీ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ అధ్యక్షులు చాణక్యరాజు, హెచ్ఎం నళినిఫోటో...మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించిన హాకి ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు చాణిక్యరాజు, హెచ్.ఎం. నళిని, క్రీడాకారులునంద్యాల పట్టణంలోని ఎస్. పి.జి హైస్కూల్ మైదానంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'హాకీ మాంత్రికుడు' మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణక్యరాజు, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యరాజు, జాయింట్ సెక్రటరీ జెడ్ ఎస్ పి దివాకర్, ఎస్పీజీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నళిని ముఖ్యఅతిథులుగా హాజరై, ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల జాతీయ స్థాయి హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు మిద్దె శిశిర గ్రేస్, జెరూషా క్రిష్టియా, భార్గవిలతో పాటు వెటరన్ క్రీడాకారుడు శిరవెళ్ల విల్సన్‌ను అసోసియేషన్ ప్రతినిధులు, పాఠశాల హెచ్ఎం జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

## సామర్ధ్యాల సాధనకు కృషి చేయండి




**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 29.**
తరగతి గదిలో విద్యార్థులకు ప్రత్యేక బోధనా వ్యూహాలు రూపొందించి సామర్ధ్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశిక్షణ సంస్థ పరిశీలకులు షేక్ షఫీవుల్లా అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘం డిఎల్ఎన్ఆర్ ఉన్నత పాఠశాల క్లస్టర్ సమావేశంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధనాభ్యసన సామాగ్రితో ప్రతి ఒక్కరూ బోధన చేయాలన్నారు. ఎఫ్ఏ మార్క్స్ నమోదు సోమవారం సాయంత్రానికి పూర్తి చేయాలని తెలిపారు. సిలబస్ సకాలంలో పూర్తిచేసి పిల్లల సమగ్ర అభివృద్ధికి బాటలు వెయ్యాలన్నారు. గ్యారంటెడ్ ఎఫ్ఎల్ఎన్ పై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టి భాష, సంఖ్యల పరిజ్ఞానం విద్యార్థులు అందరూ చేసే విధంగా అభ్యసన జరగాలని కోరారు. విద్యార్థుల నైపుణ్యాల పెరుగుదలకు క్లస్టర్ సమావేశం వేదిక కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పెంచలయ్య, రిసోర్స్ పర్సన్ గండికోట సుధీర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి అమ్మాయికి స్వర్ణ పతకం

### అమరావతి ఛాంపియన్‌షిప్‌లో పత్తి నిత్య హాసిని సత్తా



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,ఆగస్టు 29 :**
తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్‌లో శ్రీకాళహస్తికి చెందిన పత్తి నిత్య హాసిని అండర్-17 బాలికల షాట్‌పుట్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ముగింపు వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, క్రీడల మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా నిత్య హాసిని గోల్డ్ మెడల్ అందుకుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన హాసినిని ముఖ్య అతిథులు అభినందించారు. ఆమె విజయంపై తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, శ్రీకాళహస్తి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం.. కార్యక్రమానికి ప్రజల స్పందన

ప్రజల గడప వద్దకు కూటమి ప్రభుత్వ సంక్షేమం
హామీల అమలుపై ప్రజల నుంచి నేరుగా ఆరా

**శ్రీ కాళహస్తి ,పెన్ పవర్, ఆగస్టు 29 :**
స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు 32వ వార్డు 106వ బూత్ పరిధిలో ఇంటింటికీ తెలుగుదేశం.. ఇంటింటికీ మీ బొజ్జల కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నిర్వహించారు.
కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు తీరు, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను నేరుగా విని, వాటిని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు భరోసా ఇచ్చారు.
ఎన్నికల హామీల అమలుతో పాటు ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తోందని తెలిపారు.
ప్రజలతో మమేకమై.. సమస్యలు తెలుసుకుంటూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి కూడా కార్యక్రమానికి మంచి స్పందన లభించింది.
ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కంటా రమేష్, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, 32వ వార్డు ఇన్‌చార్జ్ పోలూరు శ్రీనివాసులురెడ్డి, బూత్ కన్వీనర్



ఎస్.కె. షాబుద్దీన్, మీడియా కోఆర్డినేటర్ పాలవత్తి యశ్వంత్, 32వ వార్డు అధ్యక్షుడు మునిరాజ యాదవ్, రాజారెడ్డి, రాకేష్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ నందు ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుక

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 29
నంద్యాల లోని బాబా నగర్ నందు గల శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ ఓపెన్ ఆడిటోరియం నందు వ్యవహారిక భాషా పితామహుడు ఉద్దండ పండితుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎంతోమంది విద్యార్థులను ఉద్యోగార్దులుగా తీర్చిదిద్దిన విద్యావేత్త డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి విచ్చేసి తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలవేసి వందన సమర్పణ గావించారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని అంతర్ పాఠశాలలో భాగంగా విద్యార్థులలో భాష, విషయ, సాహిత్య పరిజ్ఞానాన్ని బాల్య దశలోనే పెంపొందించాలని సదుద్దేశంతో పద్య పఠనం( శతక పద్యములు) కవితా రచన (అమ్మ భాష గొప్పతనం ) లేఖా రచన ,వక్తృత్వం, అనగనగా కథ చెబుతా వింటారా వంటి పోటీలను నిర్వహించడమైనది. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రథమ బహుమతిగా రామాయణం...ద్వితీయ బహుమతిగా మహాభారతం...తృతీయ బహుమతిగా భాగవతం...ప్రత్యేక బహుమతిగా పంచతంత్రం పుస్తకాలను విద్యార్థులకు అందజేసి వాటితో పాటు గోల్డ్, సిల్వర్ ,బ్రాంజ్ మెడల్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల పద్య పఠనం, కవిత గానం, ఉపన్యాసాలు కిండర్ గార్డెన్ చిన్నారుల కథ చెబుతా వింటారా అలతి అలతి పదాలతో అలరించారు.
ఈ సందర్భంగా విద్యార్థులు బాల్య దశలోనే భాష పై మమకారాన్ని, చక్కని పటుత్వాన్ని అలవర్చుకున్నప్పుడే భవిష్యత్తులో




గొప్పవైన వ్యక్తులుగా సమాజానికి తోడ్పడే విధంగా తయారవుతారని విద్యార్థులకు తెలియజేశారు.
ఈ సందర్భంగా విద్యార్థుల భాషాభివృద్ధి కోసం కృషి చేస్తున్న తెలుగు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

## జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తరించాలి




**నంద్యాల ప్రతినిధి ఆగస్టు 29-**
జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు మెరుగైన మానవతా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అన్నారు. శనివారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం, అవయవదానం, వైద్య సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ప్రథమ చికిత్స, సీపీఆర్ శిక్షణ వంటి కార్యక్రమాలను మరింత విస్తరించాలన్నారు. యువత, మహిళల్లో రక్తదానంపై అవగాహన పెంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు రెడ్‌క్రాస్‌తో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. డోన్, శ్రీశైలం ప్రాంతాలతో పాటు జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో రక్త నిల్వ కేంద్రాలు, జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిరాశ్రయులు, యాచకుల కోసం ఆశ్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.
ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఫుట్‌పాత్‌లపై ఆశ్రయం లేకుండా ఉంటున్న వృద్ధులు, నిరాశ్రయుల కోసం ప్రత్యేక ఆశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ "తక్కువ ప్రసంగాలుఎక్కువ సేవా




కార్యక్రమాలు" లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ "తక్కువ ప్రసంగాలుఎక్కువ సేవా కార్యక్రమాలు" లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. సేవలందించిన పలువురికి కలెక్టర్, ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు.

# కౌంటర్లలో దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు?







ముక్కంటి ఆలయంలో సెల్‌ఫోన్, లగేజీ కౌంటర్లపై ఎమ్మెల్యే కు భక్తుల ఫిర్యాదులు
నిర్ణీత రుసుముల కంటే అధికంగా వసూళ్లు..!
ఎమ్మెల్యే ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తున్న కాంట్రాక్టర్..!
కౌంటర్ల నందు ఎలక్ట్రానిక్ రశీదులు తప్పనిసరి చేయాలని భక్తుల డిమాండ్.
శ్రీకాళహస్తి టెంపుల్, పెన్ పవర్,ఆగస్టు 29:
దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన సెల్‌ఫోన్, లగేజీ కౌంటర్లే ఇప్పుడు వివాదాలకు కేంద్రంగా మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయంలోకి సెల్‌ఫోన్లు,లగేజీ తీసుకెళ్లేందుకు అనుమతి లేకపోవడంతో భక్తులు తప్పనిసరిగా ఈ కౌంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే పరిస్థితిని కాంట్రాక్టర్ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
కౌంటర్ల వద్ద దేవస్థానం నిర్ణయించిన రుసుముల కంటే అధికంగా వసూలు చేస్తున్నారంటూ పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. రుసుముల వివరాలు స్పష్టంగా ప్రదర్శించకపోవడం, చెల్లించిన మొత్తానికి సరైన రశీదు ఇవ్వకపోవడం వంటి అంశాలపై కూడా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక నిబంధనలు, నిర్ణీత రుసుములపై అవగాహన లేకపోవడంతో సిబ్బంది అడిగిన మొత్తాన్ని చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరా?
గత నెలలో ఎమ్మెల్యే ముక్కంటి ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సమయంలో సెలఫోన్ కౌంటర్ల వద్ద ఉన్న భక్తులు సెల్ ఫోన్ మరియు లకేజి లకు అదనపు వసూళ్ల చేస్తున్నారు అని ఫిర్యాదులు చెయ్యడం జరిగింది. దీంతో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి స్పందించి, భక్తుల నుంచి అధిక ధరల వసూళ్ళ పై అగ్రహం వ్యక్తం చేశారు. సంభందిత కాంట్రాక్టర్ పై చర్యలు చెప్పట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు అలసత్వం కారణంగా నేటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా కౌంటర్ల నందు భక్తుల నుంచి సెలఫోన్,లకేజి వాటికి అధిక ధరలు వసూళ్ల చెయ్యడం జరుగుతోంది.
కౌంటర్ల నందు ఎలక్ట్రానిక్ రశీదు తప్పనిసరి చేయాలి.
కౌంటర్ల వద్ద "సెల్‌ఫోన్‌కు ఇంత.. లగేజీకి ఇంత" అంటూ స్పష్టమైన రుసుముల పట్టికను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్న అన్ని టెంపుల్స్ నందు ఉన్న విధంగా ఎలక్ట్రానిక్ మిషన్ల ద్వారా రశీదు ఇచ్చే విధానాన్ని తప్పనిసరి చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.
భక్తుడు చెల్లించిన మొత్తానికి వెంటనే ఎలక్ట్రానిక్ రశీదు జనరేట్ అయ్యేలా వ్యవస్థ ఏర్పాటు చేస్తే నిర్ణీత రుసుముల కంటే అదనంగా వసూలు చేసే అవకాశాలు తగ్గుతాయని భక్తులు అంటున్నారు. సెల్‌ఫోన్ లేదా లగేజీ వివరాలతో పాటు వసూలు చేసిన మొత్తం, తేదీ, సమయం వంటి వివరాలు రశీదులో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఎలక్ట్రానిక్ రశీదు విధానం అమలు చేస్తే కౌంటర్ల రోజువారీ వసూళ్లను దేవస్థానం అధికారులు సిస్టమ్ ద్వారా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని, నగదు లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుందని భక్తులు పేర్కొంటున్నారు. ప్రతి భక్తుడికి రశీదు ఇవ్వడం తప్పనిసరి చేస్తే భక్తుల నుంచి అధికంగా వసూళ్లు చేసే అవకాశం ఉండదని భక్తులు కోరుతున్నారు.
భక్తుల సొమ్ముకు లెక్క చెప్పాల్సిందే!
ముక్కంటి దర్శనానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఆలయంలోకి సెల్‌ఫోన్, లగేజీ తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో కౌంటర్లను ఆశ్రయించడం వారికి తప్పనిసరి. అలాంటి పరిస్థితిలో నిర్ణీత రుసుముల కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు కాకుండా చూడాల్సిన బాధ్యత దేవస్థానం అధికారులపై ఉంది.
అధిక వసూళ్ల ఆరోపణలు నిజమైతే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు ఇప్పటివరకు జరిగిన వసూళ్లపై కూడా అధికారులు పరిశీలన చేయాలని భక్తులు కోరుతున్నారు. కౌంటర్ల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణను పెంచి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా భక్తుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్, లగేజీ కౌంటర్లు భక్తులపై అదనపు భారంగా మారకుండా దేవస్థానం ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## వాకింగ్ కి వెళ్లిన విద్యార్థులపై దూసుకెళ్లిన వాహనం ఒకరు మృతి, ఇద్దరికీ తీవ్ర గాయాలు

**పెళ్లకూరు:పెన్ పవర్, ఆగస్టు 29**
నాయుడుపేట- పూతలపట్టు 71వ జాతీయ రహదారిపై వాకింగ్ కి వెళ్లిన విద్యార్థులను అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం వారిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆదిత్య బాంబే(17) అక్కడికక్కడే మృతి చెందాడు, మరో ఇద్దరు మహేష్(17) బ్రహ్మయ్య(17)లు గాయాలకు గురయ్యారు.వీరు నాయుడుపేట వేమ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. వాకింగ్ నిమిత్తం నాయుడుపేట నుండి, చంబడి పాలెం వరకు వాకింగ్ చేసే సేద తీర్చుకునేందుకు డివైడర్ పై కూర్చున్నారు. అంతలోనే మృత్యువు రూపంలో అశోక్ లేలాండ్ దోస్త్ మినీ లారీ వాహనం కూర్చున్న వారిపై దూసుకు వచ్చింది.



ఈ ప్రమాదంలో బీహార్ నివాసి ఆదిత్య బాంబే మృతి చెందాడు. మరో ఇద్దరు గాయాలు కావడంతో ఈ సంఘటన తెలుసుకున్న సీఐ సంగమేశ్వర రావు ఎస్సై ఆదిలక్ష్మి గాయపడిన విద్యార్థులను వైద్య నిమిత్తం నాయుడుపేటకు తరలించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన విద్యార్థి ఆదిత్య బాంబే మృతి చెందాడు అన్న వార్త తల్లిదండ్రులకు చేరడంతోకన్నీరు మున్నీరుగా తల్లడిల్లిపోయారు. ఉపాధి కోసం ఈ ప్రాంతానికి వచ్చి కన్న కొడుకునే దూరం చేసుకున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాద సంఘటనపై ఎస్ ఐ ఆదిలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## మున్నా రాయల్ జన్మదినం.. రోగులకు పండ్ల పంపిణీ

**శ్రీకాళహస్తి: పెన్ పవర్, ఆగస్టు 29**
శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ బోర్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ కాపు నాయకులు సాధన మున్నా రాయల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏరియా ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు మున్నా రాయల్ అభిమానులు, యువత ఆధ్వర్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు. కార్యక్రమంలో మురళి, సూర్యరెడ్డి, అస్లాం, యాకూబ్, హరి, సతీష్ రాయల్, శివ రాయల్స్, దివ్యకాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌రెడ్డి పాలనంతా అబద్ధాలు, మోసాలే!

## డా. ఎం. ఉమేష్‌రావు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఆగస్టు 29:**
మాజీ సీఎం జగన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేశారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్‌రావు ఆరోపించారు. శనివారం తొట్టంబేడు మండలం కొత్తూరులో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. జగన్‌రెడ్డి హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం నవ సమాజానికి బాటలు వేద్దాం





**రొంపిచర్ల పెన్ పవర్ ఆగస్టు 29**
బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకై ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ప్రత్యేకతనిఖీలు... బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం నవ సమాజానికి బాటలు వేద్దాం.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు – పులిచెర్ల మండలం మండలం మండలంలో విస్తృత సోదాలు చిత్తూరు, ఆగస్టు 29 , 2026 బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈకార్యక్రమంలో భాగంగా ఈరోజు ఆగస్టు 29 , 2026 బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా,కల్లూరు మండలకేంద్రం లో పలు దుకాణాలు వెల్డింగ్ షాపులు మరియు చికెన్ సెంటర్లు పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలనుఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ లేబర్ ఆఫీస్ జగదీష్ గారు మరియు వారి సిబ్బందితోపాటు, గ్రేట్ విజన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం బాబు. విద్య, వైద్య, పోలీసు, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఈ కార్యాచరణను నిర్వహించారు. పులిచెర్ల రొంపిచర్ల మండలం మండలాలలో ఉన్న పోలీస్ శాఖ వారు పూర్తి మద్దతు నిచ్చి , అన్ని దుకాణాలలో క్షుణ్ణంగా తనిఖీ చేసి అందరికీ బాల కార్మిక వ్యవస్థ పై బాల కార్మిక చట్టంపై అవగాహన కల్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో రొంపిచర్ల మర్చంట్ అసోసియేషన్ సభ్యులు స్థానికులు వర్తక వ్యాపారస్తులు ఐసిపిఎస్ సోషల్ వర్కర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**ఉదయగిరి, పెన్ పవర్ ఆగస్టు 29 :**
ఉదయగిరి మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన కందవరపు మల్లికార్జున, మంజుల దంపతుల కుమార్తె మౌనిక వివాహ వేడుకల్లో భాగంగా నిర్వహించిన గంధపు నలుగు కార్యక్రమం ఘనంగా జరిగింది.
ఈ కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ హాజరై నూతన వధువు మౌనికను అక్షింతలతో ఆశీర్వదించారు. అనంతరం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 వేల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నూతన వధువుకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. మౌనిక నూతన దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 51 మంది రైతులకు రూ.17.09 కోట్ల పరిహారం

## బిల్లులు విడుదల మంత్రి డా. పెమ్మసాని

**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 29,**



గుంటూరు ఛానల్ ఎక్స్‌టెన్షన్ కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందించే ప్రక్రియలో మరో ముందడుగు పడిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.4వ విడతలో భాగంగా 51 మంది రైతులకు రూ.17.09 కోట్ల విలువైన 5 సీఎఫ్ఎంఎస్ బిల్లులు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గరపాడు, ప్రత్తిపాడు, మల్లాయపాలెం, కొండేపాడు, రావిపాడు గ్రామాలకు చెందిన రైతులకు ఈ పరిహారం అందనుంది.
ఇక మిగిలిన సుమారు రూ.14 కోట్ల పరిహారం కూడా త్వరలో విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నామని డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. భూములు ఇచ్చిన ప్రతి రైతుకు రావాల్సిన పరిహారం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నామని చెప్పారు.రైతుల సహకారంతో చేపడుతున్న గుంటూరు ఛానల్ ఎక్స్‌టెన్షన్ ఫేజ్1 పనులను ముందుకు తీసుకెళ్లడంతో పాటు, పెండింగ్ పరిహారాలను సకాలంలో అందించేందుకు చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# మారుమూల గ్రామాలకు 4జీ, 5జీ సేవలు

రూ.34 కోట్లతో ఉదయగిరి నియోజకవర్గంలో 34 మొబైల్ టవర్లు
జనార్ధనపురంలో టవర్ నిర్మాణానికి శంకుస్థాపన
వింజమూరు, పెన్ పవర్ ఆగస్టు 29 :
మారుమూల గ్రామాలకు మెరుగైన మొబైల్, ఇంటర్నెట్ సేవలను అందించాలనే లక్ష్యంతో ఉదయగిరి నియోజకవర్గంలో కొత్తగా మొబైల్ టవర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వింజమూరు మండలం జనార్ధనపురం గ్రామపంచాయతీలో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న బీఎస్ఎన్ఎల్ 4జీ, 5జీ మొబైల్ టవర్ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన జరిగింది. నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎం.డి. ఫరూఖ్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కలిసి టవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం రూ.34 కోట్ల వ్యయంతో 34 మొబైల్ టవర్ల నిర్మాణానికి అనుమతులు పొందినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో పాటు నియోజకవర్గ టెలికాం అడ్వైజరీ డైరెక్టర్ తాటికొండ అనూష కృషితో ఈ ప్రక్రియ ముందుకు సాగిందన్నారు. ఇప్పటికే 21 టవర్లకు పూర్తిస్థాయి అనుమతులు లభించాయని, నిర్మాణ పనులను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు.
మొబైల్ సిగ్నల్, ఇంటర్నెట్ సదుపాయాలు అందుబాటులో లేక





గతంలో మారుమూల ప్రాంతాల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులకు టవర్ల ఏర్పాటు ద్వారా పరిష్కారం లభించనుందని ఎమ్మెల్యే తెలిపారు. వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు విద్యార్థులు, యువత, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ విద్య, డిజిటల్ సేవలు, ప్రభుత్వ పథకాల సమాచారం, అత్యవసర సమాచార వ్యవస్థలకు మెరుగైన కనెక్టివిటీ దోహదపడుతుందని అన్నారు.
కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్, ఉదయగిరి నియోజకవర్గ అబ్జర్వర్ మీగడ ఓబులరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంజాం రాఘవేంద్ర, మాజీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, ఎనిమిది మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు



తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలే లక్ష్యం.. ప్రతి పంచాయతీలో టీడీపీ జెండా ఎగరాలి







**వింజమూరు, పెన్ పవర్ ఆగస్టు 29 :**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ప్రతి పంచాయతీలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వింజమూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన క్యాడర్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎం.డి. ఫరూక్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్ తదితరులు హాజరయ్యారు.సమావేశానికి ముందు టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నందమూరి హరికృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో, ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ప్రతి పంచాయతీలో పార్టీని బలోపేతం చేసేలా క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకం కావాలని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.అనంతరం సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజల నుంచి నాయకులు అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ నగర్‌లో త్వరలోనే నూతన రహదారుల నిర్మాణం

### టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 29:
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నంద్యాల టౌన్ 38 వార్డ్ వైఎస్సార్ నగర్‌లో త్వరలోనే నూతన రోడ్ల నిర్మాణం చేపడతామని టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ తెలిపారు . ఈ సందర్భంగా నంద్యాల పట్టణ




పరిధిలోని 38 వ వార్డులో తాటికొండ బుగ్గ రాముడు ఆధ్వర్యంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని పలు వీధులు, రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
అనంతరం ఎన్ఎండీ ఫయాజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఏయే ప్రాంతాల్లో కొత్త రోడ్లు వేయాల్సిన అవసరం ఉందో గుర్తించేందుకు నేడు క్షేత్రస్థాయి పరిశీలన జరిపినట్లు వెల్లడించారు. త్వరితగతిన నిధులు సమకూర్చి, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసి ప్రజల రాకపోకల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో 38 వార్డ్ తాటికొండ బుగ్గ రాముడు, మహేష్ బాబు, మరాఠీ సూరి , దీపక్ రెడ్డి, షబ్బీర్, ఫిరోజ్ మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కుంటలు, చెరువులు ఎండిపోతున్నాయి శ్రీశైలంలో నీరు నిల్వలు ఉన్నాయని చెబుతున్నారు దిగువకు నీరు వదలరా ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి...

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 29**
వార్షాభావ పరిస్థితుల్లో రైతులకు పంటలు సాగు చేసేందుకు, ప్రజలకు, పశువులకు త్రాగునీరు లేక విలవిల లాడిపోతున్న పరిస్థితిలో... అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం శ్రీశైలంలో నీటి నిల్వలు ఉన్నాయని చెబుతున్నారని, అయితే దిగువకు నీటిని ఎందుకు వదలడంలేదో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు. నంద్యాల మండలంలోని మిట్నాల గ్రామానికి చెందిన నీటి కుంటలో చుక్కనీరులేక ఎండిపోయిన దుస్థితిని చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే నంద్యాల పట్టణ శివారులోని చిన్నచెరువుకూడా ఎండి పోవడాన్ని నేడు పరిశీలించారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డిమాట్లాడుతూ... గత 24 సంవత్సరాల తర్వాత నంద్యాల మండలం మిట్నాల గ్రామ కుంట ఎండిపోయిందని పేర్కొన్నారు. దుర్భిక్షపరిస్థితిలో ఉన్న రైతులకు, ప్రజలకు, పశువులకు కనీసం నీరు అందించే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం లేదని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీరు నిల్వ ఉందని త్రాగునీటిని విడుదల చేస్తామని ప్రజలకు ఒట్టి మాటలు చెబుతూ కాలం గడిపేస్తున్నారని పేర్కొన్నారు. కనీసం తెలంగాణా రాష్ట్రంలో నాయకులు చూపిస్తున్న చొరవ నేడు కూటమి నేతలు చూపించడం లేదని ఎంతో దారుణంగా ఉందని విమర్శించారు. నీటి వాటాల్లో రెండు తెలుగురాష్ట్రాలకు సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. అయితే మన ఏపీకి మాత్రం నీటిని ఎందుకు విడుదల చేయడంలేదో ప్రభుత్వం చెప్పాలన్నారు. వీటికి అంతటికి కారణం తెలంగాణ సీఎంతో ఏపీ సీఎం చేసుకున్న చీకటి ఇప్పందం అని తేటతెల్లం అయ్యిందన్నారు. జిల్లా కలెక్టర్ మాత్రం సాగునీరు ఉందని, త్రాగునీరు ఉందని





చెబుతున్నారని, అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయనడానికి మిట్నాల కుంట సాక్షం అన్నారు. ఇటీవల ప్రధాన మంత్రి మన్కీ బాత్లో నంద్యాలకు త్రాగు నీరు, సాగునీరు ఇస్తున్నామని పొగిడారని ఇది నిజంగా ఉందో లేదో అధికారులు చెప్పాలన్నారు. కలెక్టర్ కార్యాలయానికి 10 కిలో మీటర్ ల దూరంలో ఉన్న మిట్నాల గ్రామానికి నీరు లేదన్నారు. ఈ గ్రామాన్ని అభివృద్ధి చేసింది మాత్రం మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి అని ప్రతి ఒక్కరు చెబుతున్నారని తెలిపారు. నీటి సమన్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు తిరుపతి రెడ్డి,రైతులు, వైసీపీ నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సాయి నాధుని సన్నిధిలో ఉప్పాల రాము

**బంటుమిల్లి పెన్ పవర్ ఆగస్టు 29**
బంటుమిల్లి మండలంలోని కంచడం గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ సాయిబాబా ఆలయాన్ని పెడన నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉప్పాల రాము శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పాల రాము పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా టీం తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ క్యాంపెయిన్

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 29,**

నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా టీం తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు 200 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకోవాలని అవగాహన కల్పించారు.నగరంపాలెం సిఐ ఎం రాజేష్ మరియు వెస్ట్ ట్రాఫిక్ సిఐ సింగయ్య , నగరంపాలెం ఎస్సై రాంబాబు , అలాగే ఎన్టీఆర్ ఫ్యాన్స్ స్టేట్ కన్వీనర్ పుల్లా సుందరంబాబు ,



గుంటూరు జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మద్ది రామకృష్ణ గ్రంధి అనిల్ కుమార్ , వి ఎన్ ఆర్ టీం, గుంటూరు ఎన్టీఆర్ ఫ్యాన్స్ టీం అందించిన సహకారాన్ని అభినందించారు.
ఈ కార్యక్రమంలో టీం తారక్ ట్రస్ట్ ఫౌండర్ మనోజ్ యార్లగడ్డ , కో-ఫౌండర్లు వంశీకృష్ణ కాగిత కార్తీక్ యార్లగడ్డ , టీం సభ్యులు శ్యాం యార్లగడ్డ , అవినాష్ , నరసింహ గారు పాల్గొన్నారు.నందమూరి హరికృష్ణ గారి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజల ప్రాణ భద్రత కోసం మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని టీం తారక్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడండి సురక్షితంగా ఇంటికి చేరండి.”

# గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం విద్యార్థుల్లో అవగాహన పెంచాలి డీఆర్వో ఖాజావలి



గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 29:
జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల, కళాశాల స్థాయిలో ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలో నార్కోటిక్స్ నిర్మూలన, గంజాయి విక్రయాల అడ్డుకట్ట లక్ష్యంగా నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న చర్యలపై అదనపు ఎస్పీ రమణమూర్తి నివేదికను వివరించారు.ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థల్లో నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల్లో ప్రవర్తనా మార్పులు, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్న ప్రాథమిక లక్షణాలను గుర్తించేలా ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు.డ్రగ్స్ హాట్‌స్పాట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని, పాడుబడిన భవనాలను తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీఐటీ, ఎన్‌డీపీఎస్ చట్టాలను కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గుంటూరు జీజీహెచ్‌లోని డీ-అడిక్షన్ కేంద్రాన్ని అవసరమైన సిబ్బంది, మౌలిక వసతులతో అభివృద్ధి చేయాలని సూచించారు.యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, మాదకద్రవ్యాల మహమ్మారిని జిల్లా నుంచి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు, విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని డీఆర్వో పిలుపునిచ్చారు.సమావేశంలో విద్యా, వైద్యారోగ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువత ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలి

**ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత పాత్ర కీలకం : ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు**
**బ్యాంకింగ్ సేవలు, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన**

**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 29:**

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో యువతీ యువకులకు నూతన ఓటు నమోదు, ఓటు హక్కు, బ్యాంకింగ్ సేవలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడం ద్వారా సమర్థవంతమైన ప్రజాస్వామ్య నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతన ఓటర్లు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకొని, ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.
ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కట్ట బదరినాగ్ విద్యార్థులకు జీరో బ్యాలెన్స్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ తదితర బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు. విద్యార్థి దశ నుంచే ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలను జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.“పచ్చని చెట్లుప్రగతికి మెట్లు” అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీఎల్ఓలు పి.ఎస్. నంబర్111 ఎల్.ఏ.వి. సుబ్బారావు, పి.ఎస్. నంబర్114 మొహమ్మద్ గౌస్య పాల్గొని విద్యార్థులకు ఓటు నమోదు ప్రక్రియ, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కళాశాల సివిక్స్ అధ్యాపకురాలు షోపోరా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆవశ్యకత, ఓటు విలువను వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





# విక్రమ్-1 విజయ గగనంలో చీరాల యువతేజం రాకేష్

దేశ తొలి ప్రైవేటు రాకెట్ తయారీ బృందంలో కీలక భాగస్వామ్యం రాకేష్‌ను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే కొండయ్య.. యువతకు ఆదర్శమని ప్రశంస

**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 29:**

భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్రకు నాంది పలికిన విక్రమ్-1 తొలి ప్రైవేటు రాకెట్ విజయవంతమైన ప్రయోగంలో చీరాల యువకుడు గారపాటి రాకేష్ భాగస్వామిగా ఉండటం చీరాల పట్టణానికే కాకుండా బాపట్ల జిల్లాకే గర్వకారణమని చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య పేర్కొన్నారు. శనివారం చీరాల కొత్తపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాకేష్‌ను ఎమ్మెల్యే కొండయ్య ఘనంగా సన్మానించి అభినందించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత అంతరిక్ష చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న విక్రమ్-1 ప్రయోగంలో చీరాల యువకుడు భాగస్వామి కావడం ఎంతో ఆనందకరమైన విషయమన్నారు. చీరాల పట్టణంలోని ఉడ్‌నగర్ ప్రాంతానికి చెందిన రాకేష్ సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి ఎన్నో కష్టాలను అధిగమిస్తూ దేశ ప్రతిష్ఠాత్మక అంతరిక్ష రంగంలో తన ప్రతిభను నిరూపించుకోవడం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.విక్రమ్-1 రాకెట్ తయారీ బృందంలో మాన్యుఫ్యాక్చరింగ్ విభాగంలో రాకేష్ బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. రాకెట్‌కు సంబంధించిన కీలక భాగాల తయారీ, వాటి




నాణ్యత, కచ్చితత్వం వంటి అంశాల్లో తనవంతు సేవలు అందించారని పేర్కొన్నారు. రాకెట్ ప్రయోగం వెనుక సంవత్సరాల పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, రూపకల్పన, తయారీ, పరీక్షలు, నిరంతర శ్రమ ఉంటాయని ఎమ్మెల్యే అన్నారు.
చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయినప్పటికీ ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు సాగి నేడు అంతరిక్ష రంగంలో గుర్తింపు పొందడం రాకేష్ గొప్ప విజయమని



కొండయ్య కొనియాడారు. ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ కష్టపడే తత్వం, నేర్చుకోవాలన్న తపన, పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకోవడం నేటి యువతకు ఆదర్శమన్నారు.
ప్రతిభతో పాటు కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని రాకేష్ జీవితం నిరూపిస్తోందన్నారు. చీరాల నుంచి దేశ అంతరిక్ష రంగంలో తన ప్రతిభను చాటుకున్న రాకేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, చీరాల ప్రాంతానికి మరింత పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు రాకేష్‌ను అభినందించారు.

# నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం: సీఎండీ పి. పుల్లారెడ్డి




**గుంటూరు , పెన్ పవర్ ఆగస్టు 29:**

గుంటూరు సర్కిల్ తెనాలి డివిజన్ విద్యుత్ పంపిణీ పనితీరుపై ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి సమగ్ర సమీక్ష నిర్వహించారు. తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో విద్యుత్ సరఫరా నాణ్యత, ఫిర్యాదుల పరిష్కారం, లైన్ లాస్ తగ్గింపు, విద్యుత్ చౌర్యం నియంత్రణ, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, సబ్‌స్టేషన్ల పనితీరుపై సమీక్షించారు.వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని సీఎండీ తెలిపారు. తరచూ అంతరాయాలకు గురయ్యే ఫీడర్లు, ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు, బలహీన విద్యుత్ లైన్లను ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పీక్ అవర్స్‌లో విద్యుత్ అంతరాయాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రధానంగా 1912 సేవల ద్వారా కొత్త విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని, వినియోగదారులు ఈ-సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.వర్షాకాలంలో విద్యుత్ భద్రతా చర్యలు కచ్చితంగా పాటించాలని, సిబ్బంది రక్షణ పరికరాలతో విధులు నిర్వహించాలని సీఎండీ సూచించారు. రెవెన్యూ వసూళ్లు, లైన్ లాస్ తగ్గింపు, వ్యవసాయ విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.మావేశంలో డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, గుంటూరు సర్కిల్ ఎస్ఈ చల్లా రమేష్, ఈఈ అక్కల సత్యనారాయణ, ఏడీఈ అశోక్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ అందరి సామాజిక బాధ్యత



**విజయవాడ, పెన్ పవర్ , ఆగస్టు 29:**

బాలల హక్కుల పరిరక్షణకు తల్లిదండ్రులు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని గుడ్ షెఫర్డ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏపీ ఎండిఓ మేనేజర్ షాలిని తెలిపారు.
తాడేపల్లి మండలం డోలాస్ నగర్‌లోని గుడ్ షెఫర్డ్ కాన్వెంట్‌లో చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థాయిలో బాలల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు స్థానిక బాలల పరిరక్షణ కమిటీల్లో మహిళలు, ఆశా వర్కర్లు, యువత, బాలల పార్లమెంట్ సభ్యులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.బాలలపై లైంగిక నేరాలకు సంబంధించిన వార్తల్లో వారి వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచాలని డాక్టర్ ఫ్రాన్సిస్ తంబి సూచించారు. బాల్యవివాహాలు, పాఠశాల మానివేతలు, మొబైల్ ఫోన్ దుర్వినియోగంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సిస్టర్ కళా తెలిపారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జీవోస్, ఎన్జీవోస్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, గుడ్ షెఫర్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి మోపిదేవి మండల రెడ్ క్రాస్ సభ్యుల సత్కారం



**మోపిదేవి పెన్ పవర్ ఆగస్టు 29**

కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సమావేశం మచిలీపట్నంలో కలెక్టరేట్ గల పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డి కె బాలాజీని మోపిదేవి మండల రెడ్ క్రాస్ సొసైటీ చైర్పర్సన్ యర్రంశెట్టి సుబ్బారావు సన్మానించి,తమ గ్రామానికి సంబంధించిన స్మశాన వాటిక సిమెంట్ రోడ్డు నిర్మాణానికి 16 లక్షల రూపాయలను నిధులు కేటాయించారని, రోడ్డు నిర్మాణం కూడా పూర్తయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ కు సుబ్బారావు కృతజ్ఞతలు తెలియజేస్తూ సన్మానించారు.

# “మాతృభాష మన ఉనికికి గుర్తింపు...

## వెల్లటూరు పాఠశాలలో ఘనంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం.



**భట్టిప్రోలు,పెన్ పవర్ (ఆగస్టు 29)**

వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో శనివారం ఘనంగా నిర్వహించారు.
తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో మాతృభాషపై అభిమానం,తెలుగు సాహిత్యంపై ఆసక్తి పెంపొందించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు తెలుగు గీతాలు ఆలపిస్తూ, పద్యాలు పఠిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు.అలాగే మహనీయుల జీవితాలను,తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని విద్యార్థులకు పరిచయం చేసే ఉద్దేశంతో గిడుగు రామమూర్తి, అన్నమయ్య, తెలుగుతల్లి తదితరుల వేషధారణలో విద్యార్థులు ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. వారి వేషధారణలు, సంభాషణలు, ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. అరుణకుమారి మాట్లాడుతూ, తెలుగు భాష కేవలం సంభాషణకు మాత్రమే పరిమితమైనది కాదని,అది మన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర,సాహిత్యానికి ప్రతీక అని అన్నారు. మాతృభాషపై విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే గౌరవం,అభిమానం పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.
“తెలుగు భాషను ప్రేమించడం అంటే మన సంస్కృతిని ప్రేమించడం,మన మాతృభాషను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత” అని హెచ్ఎం పేర్కొన్నారు.తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన గీతాలు,పద్యాల పఠనం, వేషధారణలు తదితర పోటీలలో ప్రతిభ కనబరిచి, విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.అదేవిధంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని,క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు,జట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.
“పుస్తకం జ్ఞానాన్ని ఇస్తుంది... క్రీడలు క్రమశిక్షణను నేర్పుతాయి... రెండూ కలిసినప్పుడే సంపూర్ణ విద్య సాధ్యమవుతుంది.” అనే సందేశంతో విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమాన్ని తెలుగు ఉపాధ్యాయులు పి. శైలజ,జె. శ్రీవెంకటస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం. మురళీమోహన్,వి. శ్రీనివాసరావు,ఎం. కుటుంబరావు, కిషోర్ బాబు,పద్మ, నాగజ్యోతి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# అప్పుల బాధ తాళలేక గ్రానైట్ ఉద్యోగి ఆత్మహత్య



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 29:**

ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. ఆర్టీసీ కాలనీ పార్కు సమీపంలో ఉన్న ఎన్వీ నారాయణ కాలనీ అపార్ట్‌మెంట్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానిక గ్రానైట్ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తున్న నేరెళ్ల ఏడుకొండలు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి లోనై, ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ వచ్చిన ఆయన ఆకస్మిక మృతితో భార్యాపిల్లలు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు జరుపుతున్నారు

# రికార్డు స్థాయిలో బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టు

**ఒంగోలు, ఆగస్టు 29, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధిలో జలవనరుల మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమైనది. తీవ్రమవుతున్న వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రతికూల ప్రభావాలు రాష్ట్ర వ్యవసాయ రంగంపై పడకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకే వారంలో దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న రెండు బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టుల్లో రికార్డు స్థాయిలో పనులను పూర్తి చేయించి, ప్రారంభోత్సవాలకు వేదిక సిద్ధం చేస్తున్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల దాహార్తిని తీర్చే వెలిగొండ, ఉత్తరాంధ్ర ఆశల నిలయమైన పోలవరం ఎడమ కాలువ పనులను పరుగులు పెట్టించడం ద్వారా సర్కార్ తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకుం టోంది.రాయలసీమలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు, ప్రకాశం , నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలకు జీవనాడిగా మారిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి నల్లమల అడవుల గుండా నీటిని తరలించే ఈ సంక్లిష్టమైన ఇంజనీరింగ్ పనులను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రకాశం జిల్లాలోని కంభం, మార్కాపురం, ఎర్రగొండపాలెం ప్రాంతాలకు తక్షణమే నీరందించడమే లక్ష్యంగా మైక్రో లెవెల్ ప్లానింగ్ అమలు చేస్తున్నారు.

టన్నెల్-1 ద్వారా కృష్ణా జలాలను తరలించి వేసవికి ముందే ప్రకాశం జిల్లా భూములను తడిపేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం కాదు.. మైక్రో లెవెల్ ప్లానింగ్, రోజువారీ పర్యవేక్షణతో గడువులోగా పూర్తి చేసి నీటిని అందించడమే అసలైన డెవలప్‌మెంట్ అన్నట్లుగా పనులు పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర ఆర్థిక వికాసానికి మలుపు తిప్పే పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పూర్తిపై జలవనరుల శాఖ రాత్రింబవళ్లు శ్రమిస్తోంది. గోదావరి వరద జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంతానికి, అనకాపల్లి పారిశ్రామిక కారిడార్లకు తరలించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. గతంలో వదిలేసిన కాలువ గట్ల అనుసంధానం, గ్యాప్-1 , గ్యాప్-2 నిర్మాణ లోపాలను సాంకేతికంగా వేగంగా సరిదిద్దారు. ఈ పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలోని ప్రధాన ఆయకట్టుకు సాగునీరు అందడమే కాకుండా, విశాఖ పరిధిలోని పారిశ్రామిక అవసరాలకు ఉచితంగా తాగు, పారిశ్రామిక నీరు సరఫరా కానుంది.ఈ రెండు కీలక ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం పడనుంది. విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక ప్రాంతాలకు నీటి భద్రత లభిస్తే మరిన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లు రాష్ట్రానికి తరలివస్తాయి. అదే సమయంలో, తీవ్ర ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లా గ్రామాలకు

కృష్ణా జలాలు అందడం ద్వారా వేలాది మందికి శాశ్వత ఆరోగ్య లబ్ధి చేకూరుతుంది. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ఈ ప్రాజెక్టుల ద్వారా నీటిని నిల్వ చేసి సద్వినియోగం చేసుకోవచ్చని ప్రభుత్వం లెక్కిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాటల కంటే పనులకే ప్రాధాన్యత ఇస్తుందనే సందేశాన్ని ఈ ప్రాజెక్టుల వేగం చాటిచెబుతోంది. గత ప్రభుత్వంలో మందగించిన మౌలిక రంగాన్ని మళ్లీ పట్టాలెక్కించడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడమే కాకుండా, రాబోయే రోజుల్లో 'వాటర్ మేనేజ్‌మెంట్'లో ఏపీని దేశానికే మోడల్‌గా నిలబెట్టాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. ఒకే వారంలో రెండు అతిపెద్ద ప్రాజెక్టులలో మైలురాళ్లను అధిగమించడం రాష్ట్ర జల వనరుల రంగానికి కొత్త ఊపిరి పోసిందనే చెప్పాలి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అనిల్ లో నిర్వేదం..

**నెల్లూరు, ఆగస్టు 29, పెన్ పవర్:**
పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు.మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది.ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

# విజయవాడలో 10 చోట్ల ఫ్రీగా వసతి, ఫుడ్

**విజయవాడ, ఆగస్టు 29, పెన్ పవర్:** విజయవాడకు బతుకుదెరువు కోసం ప్రతి రోజూ ఎంతోమంది వస్తుంటారు. కూలీలు, కార్మికులు, చిరువ్యాపారులు.. ఇలా చాలామంది ఉంటారు. నగరంలో పలు ఎన్జీవోల సాయంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 10 చోట్ల ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డు ఉంటే చాలు ఈ షెల్టర్లలో ఉచితంగా వసతి, తిండి సౌకర్యం ఉంటుంది. చాలామందికి వీటిపై అవగాహన ఉండటం లేదు.. అందుకే అవగాహన కూడా కల్పిస్తున్నారు.చాలామంది ఉపాధి కోసం, ఇతరత్రా పనుల కోసం ప్రతిరోజూ విజయవాడ వస్తుంటారు. అలా వచ్చినవారికి వసతి విషయంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొంతమంది లాడ్జి, హోటల్‌లలో గదిని అద్దెకు తీసుకోవడానికి కూడా డబ్బులు లేని పరిస్థితుల్లో ఉంటారు. అలాంటి వారిలో చాలామంది రోడ్లు, బస్టాండ్లలో రాత్రిళ్లు పడుకునేవారు. ఇకపై ఎవరూ వసతి లేకుండా ఇబ్బందిపడకుండా విజయవాడలో సరికొత్త ఆలోచన చేశారు. విజయవాడలో ఉచితంగా ఆశ్రయం, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.. మున్సిపల్ సంస్థలు, ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పిస్తున్నాయి. కేవలం ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది.. ఉచితంగా వసతి పొందొచ్చు.విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా, వివిధ ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పించేందుకు ఆశ్రయాలు (షెల్టర్లు) ఏర్పాటు చేశారు. జాతీయ పట్టణ జీవనోపాధి పథకం కింద.. నగరంలోని రాణీగారితోట, వైఎస్సార్ కాలనీ, సీతన్నపేట, హనుమాన్ పేట, ఆంధ్రప్రభ కాలనీ, వడ్డెర కాలనీ, రూట్స్ హెల్త్ ఫౌండేషన్, మ్యాంగో మార్కెట్ వంటి పది ప్రాంతాల్లో ఈ ఉచిత షెల్టర్లు ఏర్పాట్లు చేశారు. వసతి పొందాలంటే ఆధార్ కార్డు చూపిస్తే చాలు రూపాయి కూడా తీసుకోకుండా 15 రోజుల పాటు ఉచితంగా వసతి కల్పిస్తారు. ఈ ఉచిత వసతి కల్పన గురించి విజయవాడ కార్పొరేషన్, ఎన్జీవో ప్రతినిధులు నగరంలో ప్రతిరోజూ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత వసతిపై ప్రచారం చేస్తున్నారు.ఒకవేళ ఎవరికైనా కుటుంబం లేకపోతే.. వాళ్లకు ఇక్కడ దీర్ఘకాలికంగా ఆశ్రయం కల్పిస్తున్నారు.. వారికి సమయానికి తిండి పెడుతూ వసతి కల్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి 15 నుంచి 20 రోజుల వరకు ఉచితంగా వసతి కల్పిస్తున్నారు. ఇక్కడ దీర్ఘకాలం పాటు నివసించడానికి అవకాశం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. రోడ్లపై నిద్రించాల్సి వచ్చే వారి కోసమే ఈ షెల్టర్లు ఏర్పాటు చేశారని.. కానీ చాలామందికి అవగాహన లేకపోవడంతో ఇక్కడికి రావడం లేదంటున్నారు. అలాగే చాలామంది రోడ్లపై భోజనం పంపిణీ చేస్తుండటంతో ఈ షెల్టర్ల వైపు చూడంట లేదని చెబుతున్నారు. కాబట్టి ఎవరైనా ఆహారం, దుస్తులు, వస్తువులు పంపిణీ చేయాలనుకుంటే నేరుగా ఈ షెల్టర్లకు వచ్చి ఇస్తే బావుంటుందంటున్నారు.

# హీట్ పుట్టిస్తున్న పులివెందుల

**కడప ఆగస్టు 29, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాయలసీమ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సరికొత్త పొలిటికల్ హీట్ మొదలైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి దశాబ్దాలుగా తిరుగులేని కోటగా, అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత గడ్డగా ఉన్న పులివెందుల మున్సిపాలిటీని ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా సానుకూల వాతావరణం నెలకొనడంతో.. పులివెందుల పురపాలక సంఘంపై పసుపు జెండా ఎగురవేయడమే లక్ష్యంగా టీడీపీ అడుగులు వేస్తోంది.ఈ మెగా పొలిటికల్ మిషన్‌ను విజయవంతం చేసేందుకు టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి క్షేత్రస్థాయిలో సీరియస్ ఫోకస్ పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పులివెందులలోని ప్రతి వార్డులోనూ కూటమి శ్రేణులను ఏకం చేస్తూ, వైకాపాకు గట్టి పోటీ ఇచ్చే బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ఆయన వ్యూహాత్మకంగా కసరత్తులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైకాపా అవినీతిని, గత ఐదేళ్ల వైఫల్యాలను ఎండగడుతూ.. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు.చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌ల పూర్తి మద్దతుతో బీటెక్ రవి దూసుకుపోతుండటం ఇక్కడి రాజకీయాలలో ఊహించని మార్పులకు దారితీస్తోంది. రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం.. ఈసారి పులివెందుల మున్సిపాలిటీని కాపాడుకోవడం వైఎస్ జగన్‌కు అంత సులువైన వ్యవహారం కాదు. గత స్థానిక ఎన్నికల్లో అధికార బలంతో ఏకగ్రీవాలు చేసుకున్న వైకాపాకు, ఈసారి కూటమి ప్రభుత్వం వంద శాతం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తుండటం పెద్ద సవాల్‌గా మారింది. నియోజకవర్గంలో చాలామంది వైకాపా ద్వితీయ శ్రేణి నాయకులు, సామాన్య ఓటర్లు కూటమి వైపు మొగ్గు చూపుతుండటంతో జగన్ కోటలో బీటలు వారుతున్నాయి. పులివెందుల మున్సిపాలిటీని ఎలాగైనా గెలిచి జగన్ సొంత నియోజకవర్గంలోనే ఆయనకు రాజకీయంగా పెద్ద షాక్ ఇవ్వాలని కూటమి కూకటివేళ్లతో కష్టపడుతోంది.

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం

**కాకినాడ, ఆగస్టు 29, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం.ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు.ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు.గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది.జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్



ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కల్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ కొన్ని చోట్ల కేటాయించే ఛాన్స్ ఉంది. అంతే తప్ప తమకు బలం ఉన్న స్థానాలను పొత్తులో భాగంగా వదులుకోకూడదన్న అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉంది. ఐదు కార్పొరేషన్లు అడిగితే మూడు ఇస్తారన్నది జనసేన వ్యూహం కావచ్చు. అదే జరిగితే జనసేన కోరినవి కాకుండా దాని బలం అంచనా వేసి కాకినాడతో పాటు మరొక రెండు కార్పొరేషన్లు కోరే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద జనసేన మాత్రం కొంత స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగానే స్థానాలను కోరాలని భావిస్తుంది. జనసేనఐదు కార్పొరేషన్లను తీసుకోగలిగితే 31.25 శాతం షేరింగ్ అవుతుంది.మరొకవైపు పవన్ కల్యాణ్ పై జనసైనికుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో జనసేన ఏ రకంగా సీట్ల షేర్ సాధిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలొకొంది.

# వారసులొస్తున్నారు.....

**విజయవాడ, ఆగస్టు 29 పెన్ పవర్:**
ఏపీలో స్థానిక సమరానికి రంగం సిద్ధమవుతున్న వేళ రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలు మొదలైనట్లు కనిపిస్తోంది. అక్టోబరులో కొత్త ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో అంతకంటే ముందే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలైందిఈసారి స్థానిక ఎన్నికలను అధికార కూటమితో పాటు వైసీపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ జరుగుతోంది. అయితే ఈసారి మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వస్తోంది. సీనియర్ నేతలు తమ స్థానంలో కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి స్థానిక ఎన్నికలను అనుకూల వేదికగా చూస్తున్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ వంటి కీలక పదవులకు తమ కుమారులు, కుమార్తెలను పోటీ చేయించాలనే ఆలోచనలో పలువురు నేతలు ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కష్టమైన పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు వారసులకు రాజకీయ అరంగేట్రం చేయించే అవకాశాన్ని కల్పిస్తున్నాయని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పైగా ఎన్నికల్లో ఆర్థికంగా, రాజకీయంగా పూర్తి స్థాయిలో సహకరించగల వ్యక్తిని బరిలోకి దించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పలువురు సీనియర్ నాయకులు తమ వారసులకు టికెట్లు ఇప్పించేందుకు ప్రయత్నించారు. టీడీపీ , వైసీపీ రెండింటిలోనూ ఇలాంటి ఆశలు ఉన్నప్పటికీ, ఎన్నికల సమీకరణాలు, గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకునిఅన్ని చోట్లా వారసులకు అవకాశం ఇవ్వలేదు. అయినప్పటికీ యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య, టీజీ వెంకటేశ్ కుమారుడు భరత్, పేర్ని నాని కుమారుడు కిట్టూ, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ వంటి వారికి రాజకీయ అవకాశం లభించింది.అదే సమయంలో పలువురు సీనియర్ నేతల వారసులకు మాత్రం గత ఎన్నికల్లో టికెట్లు దక్కలేదు. దీంతో ఇప్పుడు స్థానిక ఎన్నికలపై వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, జడ్పీ చైర్మన్ వంటి పదవులు రాజకీయంగా మంచి గుర్తింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పదవులకు వెళ్లేందుకు బలమైన పునాది అవుతాయని భావిస్తున్నారు.ఈ విషయంలో వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఇప్పటికే ముందడుగు వేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమార్తె అనూషను విజయనగరం జడ్పీ అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా వారసత్వ రాజకీయాలకు స్థానిక ఎన్నికలే తదుపరి వేదిక అన్న సంకేతం ఇచ్చారని కొందరు భావిస్తున్నారు. దీంతో ఇతర జిల్లాల్లోని సీనియర్ నాయకులు కూడా తమ కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ స్పష్టమైన తర్వాత ఈ వారసుల జాబితా మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఇతరులతో పోల్చుకోవద్దు.. సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు: సూర్యకుమార్ యాదవ్

- యువ క్రికెటర్లు ఇతరులతో పోల్చుకోవద్దన్న సూర్యకుమార్
- వయసుతో పనిలేదు, సన్నద్ధతే ప్రధానమని స్పష్టీకరణ
- పరుగులు చేస్తూ ఉంటే సెలక్టర్లే వెతుక్కుంటూ వస్తారని భరోసా
- దేశవాళీ క్రికెట్‌లో తాను పడిన కష్టాలను గుర్తు చేసుకున్న స్టార్ బ్యాటర్
- ఎవరూ చూడనప్పుడు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ క్రికెటర్లకు భారత మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక సందేశం ఇచ్చాడు. ఓపిక కోల్పోకుండా పరుగులు చేస్తూ ఉండాలని, తమ సన్నద్ధతపై నమ్మకం ఉంచాలని సూచించాడు. నిలకడగా రాణిస్తే సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారని, మీ బ్యాటే అన్నింటికీ సమాధానం చెబుతుందని భరోసా ఇచ్చాడు. ఎన్నో ఏళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో శ్రమించి, ఆలస్యంగా భారత జట్టులోకి వచ్చి అగ్రశ్రేణి బ్యాటర్‌గా ఎదిగిన తన అనుభవాన్ని సూర్య యువతతో పంచుకున్నాడు.

ఒక యువ క్రికెటర్ ప్రయాణంలో ఓపిక ఎంత ముఖ్యమో వివరిస్తూ, 'ఐఏఎన్ఎస్'తో సూర్యకుమార్ మాట్లాడాడు. "ప్రతి ఒక్కరి కథ వేరు, ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నం. అందుకే యువ క్రికెటర్లు ఇతరులతో తమను తాము పోల్చుకోవద్దని నేను చెబుతాను. నేను కూడా ఏళ్ల తరబడి ఏజ్-గ్రూప్, దేశవాళీ క్రికెట్ ఆడాను. కిట్ బ్యాగ్‌తో బస్సులు, రైళ్లలో ఎన్నో ప్రయాణాలు చేశాను. నా అవకాశం కోసం ఓపికగా ఎదురుచూశాను" అని తెలిపాడు.

భారత క్రికెట్‌లో యువ ఆటగాళ్లపై ఉండే తీవ్రమైన ఒత్తిడిని సూర్యకుమార్ ప్రస్తావించాడు. "మన దేశంలో 21 లేదా 25 ఏళ్లకల్లా జట్టులో చోటు దక్కకపోతే కెరీర్ ముగిసిపోయినట్లేనని, మరో మార్గం చూసుకోవాలని చాలామంది భావిస్తారు. కానీ,

నా దృష్టిలో వయసు అనేది గడువు కాదు, మీ సన్నద్ధతే అసలైన గడువు" అని పేర్కొన్నాడు. ఎవరూ గమనించనప్పుడు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టాలని, కఠోర సాధనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపవద్దని సూచించాడు.

సెలక్టర్ల దృష్టిని ఆకర్షించడానికి ప్రదర్శనలే అత్యంత శక్తిమంతమైన మార్గమని సూర్యకుమార్ అభిప్రాయపడ్డాడు. "క్రికెట్ పరంగా చెప్పాలంటే, మీరు పరుగులు చేస్తూ ఉంటే, మీ బ్యాటే సమాధానం

చెబుతుంది. సెలక్టర్లు కచ్చితంగా మిమ్మల్ని గుర్తిస్తారు. మీరు ఉండాల్సిన సరైన స్థానానికి చేరుకుంటారు" అని భరోసా ఇచ్చాడు. తోటి ఆటగాళ్లతో పోల్చుకుని ఆందోళన చెందే యువతకు సూర్యకుమార్ మాటలు స్ఫూర్తినిస్తున్నాయి. కలకు గడువు తేదీ ఉండదని, నిబద్ధతతో సిద్ధమైతే విజయం తప్పక వరిస్తుందని సూర్య తన కెరీర్ ద్వారా నిరూపించాడు.

## గ్రౌండ్‌లోనే కాదు.. బ్రాండ్ మార్కెట్‌లోనూ మన స్టార్లదే హవా: ఫోర్బ్స్ ఇండియా 2026 రిపోర్ట్!






**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో క్రికెట్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదు.. కోట్ల మంది ఆరాధించే ఒక అతిపెద్ద పండుగ.. టీమిండియా స్టార్ ప్లేయర్లు మైదానంలోకి దిగితే రికార్డులు బ్రేక్ అవుతాయి, అదే వాణిజ్య ప్రపంచంలోకి అడుగుపెడితే బిజినెస్ డీల్స్ దుమ్మురేపుతాయి. ప్రపంచంలోనే ఏ క్రీడాకారులకూ లేనంతటి ఫ్యాన్ బేస్, మార్కెట్ పొటెన్షియల్ భారత క్రికెటర్ల సొంతం. తమ ఆటతీరుతో పాటు మైండ్ బ్లాకింగ్ పర్సనాలిటీ, సోషల్ మీడియా ఇంపాక్ట్‌తో స్టేడియం సరిహద్దులు దాటి కార్పొరేట్ రంగాన్ని ఏలుతున్నారు. ఆటకు వీడ్కోలు పలికినా సరే, వీరి బ్రాండ్ వ్యాల్యూ కొద్దిగా కూడా తగ్గకపోవడం వీరికున్న భారీ క్రేజ్‌కు అద్దం పడుతోంది. తాజాగా ప్రముఖ వ్యాపార పత్రిక వెల్లడించిన ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 (ఖీశీతీఎవం ×అఒఖు ౯ాష్ట్రశీఎర్శీజూజూవతీం 2026) అత్యంత విలువైన సెలబ్రిటీల జాబితాలో ఇండియన్ క్రికెటర్లు తమ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. సినిమా, సంగీతం, క్రీడలు.. ఇలా దేశంలోని అన్ని రంగాల బిగ్ సెలబ్రిటీలను దాటుకుని కింగ్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ (రూ.3,017 కోట్లు), గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా (రూ.2,507 కోట్లు)లను వెనక్కి నెట్టి కోహ్లీ నంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. టీ20, టెస్టుల నుంచి తప్పుకున్నా కోహ్లీకున్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. బ్రాండ్ విలువ: ఏకంగా రూ.3,542 కోట్లు

**రెండో స్థానంలో కెప్టెన్ కూల్ ధోనీ:**

భారత జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఈ జాబితాలో రెండో భారత క్రికెటర్‌గా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ సుమారు రూ.2,141 కోట్లు. మహీ భాయ్ క్రికెట్‌కు దూరమైనప్పటికీ ధోనీకి ఉన్న అభిమానగణం, వ్యాపార కార్యకలాపాలు, ప్రకటనల ఒప్పందాలు అతడి బ్రాండ్ విలువను భారీగా నిలబెట్టాయి. మొత్తం భారత సెలబ్రిటీల జాబితాలో ధోనీ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

**దక్షిణాసియాసంస్కృతి తెలుసుకోవడం**

**మూడో స్థానంలో మాస్టర్ సచిన్:**

క్రికెట్ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కూడా ఈ ఫోర్బ్స్ జాబితాలో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సచిన్ బ్రాండ్ విలువ రూ.1,676 కోట్లుగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్ అయి ఎన్నో సంవత్సరాలు గడిచినా.. సచిన్ బ్రాండ్ ప్రభావం మాత్రం కొనసాగుతుంది. మొత్తం సెలబ్రిటీల లిస్టులో ఆయన 8వ స్థానంలో నిలిచాడు.

**నాలుగో స్థానంలో బుమ్రా:**

ఇక భారత క్రికెటర్లలో జస్‌ప్రీత్ బుమ్రా ఈ జాబితాలో అత్యంత బ్యాండ్ వ్యాల్యూ కలిగిన వారిలో ఒకడిగా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,142 కోట్లుగా నమోదు అయింది. ఫోర్బ్స్ జాబితాలో బుమ్రా మొత్తం 16వ స్థానంలో నిలిచాడు. మైదానంలో భారత పేస్ దళానికి నాయకుడిగా ఎదిగిన బుమ్రా.. వాణిజ్యంగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు.

**ఐదో స్థానంలో రోహిత్ శర్మ:**

భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ క్రికెటర్ల జాబితాలో ఐదో స్థానాన్ని దక్కించుకున్నాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,055 కోట్లు అని చెప్పాలి.. మొత్తం సెలబ్రిటీల జాబితాలో రోహిత్ 18వ స్థానంలో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి విజయాలు, అభిమానుల్లో ఉన్న ఆదరణ, వాణిజ్య ఒప్పందాలు బ్రాండ్ విలువను పెంచడంలో కీలకంగా మారాయి.

ఫోర్బ్స్ ఇండియా 2026 టాప్--5 జాబితాలో చోటు దక్కించుకున్న ఈ ఐదుగురు భారత క్రికెటర్ల మొత్తం బ్రాండ్ విలువ కలిపితే ఏకంగా రూ.9,556 కోట్లు కావడం విశేషం. గ్రౌండ్‌లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలతో పాటు మైదానం బయట వారికున్న లీడర్‌షిప్ క్వాలిటీస్, సోషల్ ఇమేజ్ ఇండియన్ ఆటగాళ్లను గ్లోబల్ మార్కెట్‌లో తిరుగులేని బ్రాండ్‌లుగా నిలబెడుతున్నాయి.

## ఆసియా క్రీడలకు నీరజ్ చోప్రా దూరం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు."ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది" అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

# దీపిక మాటలు కాదు.. చేతల్లో చూపించాలి







తాను ప్రభాస్ కంటే ఎక్కువ సినిమాలు చేశానని.. తన కంటే ఎక్కువ సక్సెస్ ఫుల్ అన్నట్లుగా దీపికా పదుకొనే ఇటీవల ఒక కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపుతున్నాయి. వేరే హీరో అంటే ఏమో కానీ.. దేశవ్యాప్తంగా తిరుగులేని అభిమానాన్ని సంపాదించుకుని ఇండియాలో బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా అవతరించిన ప్రభాస్‌ను.. వివాదాలకు దూరంగా ఉంటూ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే హీరో మీద పరోక్షంగా తన అక్కసు వెళ్లగక్కడం.. తనతో పోటీ పెట్టుకుని మాట్లాడ్డం.. అతణ్ని కించపరిచేలా మాట్లాడ్డం తెలుగు వాళ్లకే కాదు.. ఇతర భాషల వాళ్లకు కూడా నచ్చట్లేదు. ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేసే దీపికకు ముందు నుంచే సోషల్ మీడియాలో హేటర్స్ ఎక్కువ. తాజా వ్యాఖ్యలతో ఆమె మీద వ్యతిరేకత మరింత పెరిగిపోతోంది. దీపిక పాస్ట్ ఎఫైర్ల దగ్గర్నుంచి.. వివిధ సందర్భాల్లో ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోల వరకు తీసుకొచ్చి ఆమెను ట్రోల్ చేస్తున్నారు. ఇదంతా పక్కన పెడితే.. ప్రభాస్ కంటే తాను పెద్ద స్టార్ అన్నట్లు చెప్పుకుంటూ తనకు దీటుగా పారితోషకం డిమాండ్ చేస్తున్న దీపికకు నెటిజన్లు ఒక సలహా ఇస్తున్నారు. నిజంగా దీపిక అంత పెద్ద స్టార్, తనకు భారీ మార్కెట్ ఉందని నమ్ముతున్నట్లయితే.. మేల్ సూపర్ స్టార్లతో కలిసి చేసే సినిమాల్ల వారితో పోటీ పెట్టుకునే బదులు ఒక లేడీ ఓరియెంటెడ్ మూవీ చేసి తన బాక్సాఫీస్ స్టామినా ఎంతో రుజువు చేయాలని అంటున్నారు. తనే లీడ్ రోల్ చేసిన సినిమాతో తాను ఎన్ని వందల కోట్లు రాబట్టగలదో చూపిస్తే.. ఆమె ఫాలోయింగ్, మార్కెట ఎంత అన్నది అందరికీ అర్థమవుతుంది కదా అని అభిప్రాయపడుతున్నారు. చివరగా దీపిక నటించిన లేడీ ఓరియెంటెడ్ మూవీ 'చప్పక్' అయితే రూ.5′ కోట్లకు అటు ఇటుగా వసూళ్లు రాబట్టింది. అది 2020లో రిలీజైన సినిమా. పైగా అదొక ప్రయోగాత్మక చిత్రం. ఇప్పటికి దీపిక మార్కెట్ ఇంకా పెరిగి ఉంటుంది కాబట్టి.. ఇప్పుడు ఒక యాక్షన్ టచ్ ఉన్న లేడీ ఓరియెంటెడ్ సినిమా చేసి దీపిక తన స్టామినా ఏంటో చూపించాలి. ఆ సినిమా ప్రభాస్ చిత్రాల్లాగే వందలు, వేల కోట్ల వసూళ్లు రాబడితే.. అందుకు తగ్గట్లే పారితోషకం కోసం డిమాండ్ చేయొచ్చు. ప్రభాస్ కంటే తానే పెద్ద స్టార్, సక్సెస్ ఫుల్ అని బల్లగుద్ది చెప్పొచ్చు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965